
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
కర్నూలు జిల్లా వార్తలు 5
మంగళవారం 6 ఆగస్టు 2024



పంప్‌హౌస్‌లపై నిర్లక్ష్యం

ఎమ్మిగనూరు, ఆగస్టు 5:

గురురాఘవేంద్ర ప్రాజెక్టు ఎత్తిపోతల పథకాల పంప్‌హౌస్‌లకు రక్షణ లేదు. అధికారులు ఆ వైపు తిరిగి చూడటం లేదు. నదికి వరద వచ్చినప్పుడే పంప్‌హౌస్‌లను కాస్త పర్యవేక్షిస్తున్నారు. రెండు పంప్‌హౌస్‌ల్లో ఇటీవల విధ్వంసం జరిగింది. ప్రస్తుతం నదికి వరద నీరు ఉప్పొంగుతోంది. పంప్‌హౌస్‌లు సక్రమంగా పని చేస్తే రైతులకు సాగు నీరు అందేది. ఇప్పుడు ఆ పరిస్థితి కనిపించడం లేదని రైతులు ఆవేదన చెందుతున్నారు.



నందవరం మండలం జీఆర్‌పీ చిలకలడోణ పంప్‌హౌస్‌లో పరికరాలను పగలగొట్టిన దృశ్యం



మంత్రాలయం మండలం జీఆర్‌పీ మాధవరం స్టేజ్ -1 పంప్‌హౌస్‌లో యంత్ర పరికరాలను ధ్వంసం చేసిన దృశ్యం

- పరికరాలను ధ్వంసం చేసిన దుండగులు
- నిరుపయోగంగా మారిన గురు రాఘవేంద్ర ఎత్తిపోతల పథకం
- నదిలో నీరున్నా జీఆర్పీ రైతుల ఆందోళన

తుంగభద్ర నదీతీరం వెంబడి ఏర్పాటు చేసిన గురురాఘవేంద్ర ప్రాజెక్టు ఎత్తిపోతల పథకాలను అధికారులు పర్యవేక్షించడం లేదు. నది నుంచి నీటిని ఎత్తిపోసే పంప్‌హౌస్‌ల వైపు తొంగి చూడటం లేదు. వర్షాలు కురిసి నదికి వరదలు వచ్చినప్పుడు మాత్రమే పంపు హౌస్‌లను పట్టించుకుంటున్నారు. దీని వల్ల ఏ పంప్‌హౌస్‌లో ఏ యంత్ర పరికరాలు ఉన్నదీ, ఏవి పని చేస్తున్నదీ, ఏవి పని చేయనిదీ అంతుబట్టడం లేదు. ఎన్నికల కౌంటింగ్‌కు ముందు నుంచి ఇప్పటి వరకు మూగలదొడ్డి, మాధవరం, చిలకలడోణ జీఆర్పీ పంప్‌హౌసుల్లో దుండగులు విధ్వంసం సృష్టించారు. యంత్రాలను పగలగొట్టి కాపర్ వైరు, ఆయిల్‌ను ఎత్తుకెళ్లారు. దీంతో దాదాపు రూ. అర కోటికి పైగానే ప్రభుత్వానికి నష్టం వాటిల్లింది. ప్రధానంగా కోసిగి మండలంలోని జీఆర్పీ మూగలదొడ్డి ఎత్తిపోతల పథకం పంప్‌హౌస్‌లో ఎన్నికల కౌంటింగ్‌కు ముందు గుర్తుతెలియని దుండగులు పడి మోటర్లు, ట్రాన్స్‌ఫార్మర్లు పగలగొట్టి కాపర్ వైరు, ఆయిల్‌ను ఎత్తుకెళ్లారు. దీంతో దాదాపు రూ. 15 లక్షలు నష్టం వాటిల్లి ఉంటుందని తెలుస్తోంది. అలాగే నందవరం మండలంలోని జీఆర్పీ చిలకలడోన ఎత్తిపోతల పథకం పంప్‌హౌస్‌లో కూడా ఇటీవల దుండగులు పడి ట్రాన్స్‌ఫార్మర్లు, మోటార్లు, స్టార్టర్లను పగులగొట్టారు. అందులో ఉన్న కాపర్ వైరును, ఆయిల్‌ను ఎత్తుకెళ్లారు. దీంతో ఇక్కడ కూడా దాదాపు రూ. 25 లక్షల నష్టం జరిగి ఉంటుందని రైతులు పేర్కొంటున్నారు. గత నెల 28న మంత్రాలయం మండలంలో ఉన్న మాధవరం ఎత్తిపోతల పథకం పంప్‌హౌస్ స్టేజ్ -1లో విధ్వంసం సృష్టించారు. పంప్‌హౌస్‌లో ఉన్న యంత్ర పరికరాలను కసిగా పగలగొట్టారు. తుంగభద్రనదికి భారీగా నీరు వస్తుండటంతో ఎత్తిపోతల పథకం కింద ఉన్న రైతులకు సాగునీరు వదులుతారేమోనన్న అక్కసుతో ఈ విధ్వంసానికి పాల్పడినట్లు రైతులు ఆరోపిస్తున్నారు. రెండు స్టార్టర్లు, మూగు బ్రేకర్లు, మూడు ఇన్సిలేటర్లు, తొమ్మిది పీటీలు పగలగొట్టారు. దీంతో దాదాపు రూ. 10 లక్షలకు పైగా నష్టం జరిగిందని అధికారులు పేర్కొంటున్నారు. కాగా మాధవరం పంప్‌హౌస్‌లో జరిగిన సంఘటనపై టీడీపీ జిల్లా అధ్యక్షుడు పాలకుర్తి తిక్కారెడ్డి ఈ విధ్వంసానికి పాల్పడిన వారిపై కేసులు నమోదు చేసి కఠినచర్యలు తీసుకోవాలని డిమాండ్ చేయటంతో అధికారులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో ఈ సంఘటనపై కేసు నమోదు చేశారు. మిగతా విధ్వంసాలను పట్టించుకోలేదు.

కోసిగి మండలం లోని జీఆర్‌పీ మూగల దొడ్డి పంప్ హౌస్‌లో పరికరాలను తొలగించిన దృశ్యం (ఫైల్)



● **రైతన్నల కన్నీటి వరద:** తుంగభద్రనదిలో లక్షలాది క్యూసెక్కుల నీటి ప్రవాహం ఉన్నా జీఆర్పీ రైతుల పరిస్థితి దయనీయంగా మారింది. అధికారుల నిర్లక్ష్యం.. పర్యవేక్షణ లోపంతో నది నుంచి నీటిని ఎత్తిపోసే పంప్‌హౌస్‌లో దుండగులు పడి యంత్రపరికరాలను పగలగొట్టడంతో పంపింగ్ కాస్త నిలిచిపోయింది. దీంతో దాదాపు పదివేల ఎకరాల సాగునీరు ప్రశ్నార్థకంగా మారింది. ప్రస్తుతం తంగభద్ర డ్యాం ఎగువన భారీ వర్షాలు కురవడంతో డ్యాం నుంచి నీరు వదిలారు. ఇప్పుడు నదిలో దాదాపు 1.74 లక్షల క్యూసెక్కుల ప్రవాహం ఉంది. ఈ నీటిని జీఆర్పీ ఎత్తిపోతల పథకాల రిజర్వాయర్లుకు ఎత్తి పోయాల్సి ఉంది. మూడు పంప్‌హౌస్‌లు పనిచేయకపోవటంతో ఈసారి నీరు ఎత్తిపోసే పరిస్థితి కనిపించటం లేదు. మూగలదొడ్డి, మాధవరం, చిలకలడోణ రిజర్వాయర్ల కింద ఉన్న రైతుల ఆశలు అడియాశలుగా మారేలా ఉంది. అధికారులు పంప్‌హౌస్‌ల మరమ్మతులకు ప్రతిపాదనలు తయారు చేసి పంపినా.. నిధులు మంజూరై మరమ్మతు పనులు ఎప్పుడు చేసేదీ అర్థం కాని పరిస్థితి. త్వరగా మరమ్మతులు పూర్తిచేయకపోతే నదిలో నీటి ప్రవాహం తగ్గే ప్రమాదం ఉంది. అటు తరువాత ఏం చేసినా రైతులకు నీరివ్వలేదు. జిల్లాలో ఈసారి వర్షాలు అంతంత మాత్రంగానే ఉన్నాయి. కనీసం నదికి వచ్చే వరద నీటినైనా ఎత్తిపోస్తారనుకుంటే ఆ పరిస్థితి కనిపించడం లేదని రైతులు ఆవేదన చెందుతున్నారు.



నీరులేక వెల వెల బోతున్న జీఆర్‌పీ చిలకలడోణ రిజర్వాయర్



తుంగభద్ర నదిలో పుష్కలంగా ప్రవహిస్తున్న నీరు

జిల్లా అభివృద్ధిపై సీఎం చంద్రబాబు ఆరా

కలెక్టర్ల సదస్సులో రంజిత్‌బాషాకు సూచనలు



సదస్సుకు హాజరైన కలెక్టర్లు

కర్నూలు(కలెక్టరేట్), ఆగస్టు 5: జిల్లా విజన్ డాక్యుమెంట్‌ను తయారు చేయాలని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు జిల్లా కలెక్టర్‌ను ఆదేశించారు. విజయవాడలో సోమవారం రాష్ట్ర స్థాయి కలెక్టర్ల సదస్సు జరిగింది. ఈ సమావేశానికి కలెక్టర్ పి.రంజిత్ బాషా హాజరయ్యారు. ఈ సదస్సులో జిల్లా అభివృద్ధిపై సీఎం చంద్రబాబు ఆరా తీశారు. జిల్లా విజన్ డాక్యుమెంటు సిద్ధం చేసుకోవాలని దిశా నిర్దేశం చేశారు. ప్రజలకు మెరుగైన పాలన, జీవన ప్రమాణాలు అందించాలన్నారు. పేదల సేవలో అనే కార్యక్రమం ద్వారా అనుసంధానం అవుదాం అని పిలుపునిచ్చారు. ఆగస్టు 15న అన్న క్యాంటీన్లను ప్రారంభించాలన్నారు. రాబోయే వంద రోజుల్లో ప్రభుత్వం చేపట్టాల్సిన కార్యక్రమాలకు సంబంధించి ప్రణాళిక రూపొందించి దాన్ని కలెక్టర్లు సమర్థవంతంగా అమలు చేయాలని కోరారు. ప్రభుత్వ కార్యక్రమాలు అమలు చేయడంలో సమస్యల పరిష్కారంలో బాధ్యతాయుతంగా పని చేసి ప్రభుత్వానికి మంచి పేరు తీసుకురావాలన్నారు. ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యమివ్వాలన్నారు. ప్రభుత్వం చేపట్టిన ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీలో కలెక్టర్ చూపిన చొరవను అభినందనీయమన్నారు.

హంద్రీ నీవా సుజల స్రవంతి కాలువకు గండి

వంద ఎకరాల్లో నీట మునిగిన పంటలు



గండి పడిన హెచ్ఎన్ఎస్ కాలువ

వెల్దుర్తి, ఆగస్టు 5: వెల్దుర్తి మండలంలో ప్రవహిస్తున్న హంద్రీనీవా సుజల స్రవంతి కాలువకు ఆదివారం రాత్రి భారీ గండి పడింది. దీంతో వంద ఎకరాలకు పైగా పంటలు నీటమునిగాయి. వెల్దుర్తి మండలంలోని 58వ కిలోమీటరు వద్ద శెట్టిపల్లి (మల్లేపల్లి పంప్‌హౌస్) వద్ద హంద్రీనీవా కాలువకు గండిపడింది. సోమవారం ఉదయం రైతులు గుర్తించి పంప్‌హౌస్ అధికారులకు తెలియజేశారు. ఈ పంప్ హౌస్ కేంద్రం చుట్టూ పక్కల వెల్దుర్తి, కోడుమూరు, కల్లూరు రెవెన్యు పరిధిలో పొలాలు ఉన్నాయి. ఈ మండలాల పరిధిలో సుమారుగా వంద ఎకరాలకు పైగా పంటలు నీట మునిగాయి. దీంతో రైతులు తీవ్రంగా నష్టపోయారు. హంద్రీనీవా కాలువ మల్యాల (మొదటి) నుంచి 9 కి.మీ పరిధిలో బ్రాహ్మణకొట్కూరు పంప్‌హౌస్ (రెండవది) , 58 కి.మీ. పరిధిలో శెట్టిపల్లె (మల్లేపల్లె) పంప్‌హౌస్ మూడవది. ఆగస్టు ఒకటో తేదీన మల్యాలలో హంద్రీనీవా కాలువకు నీళ్లు వదిలారు. ఆదివారం నీరు శెట్టిపల్లె పంప్‌హౌస్‌కు చేరుకున్నాక అధికారులు 6 మోటార్ల ద్వారా నీటిని ఎత్తిపోసి దిగువకు వదులుతున్నారు. ఈ క్రమంలో పంప్‌హౌస్ వద్ద 100 మీటర్ల పరిధిలో కాలువకు గండి పడింది. మల్లేపల్లె పంప్‌హౌస్ కేంద్రంలో మోటార్లను బంద్‌చేస్తే బ్రాహ్మణకొట్కూరు వరకు మధ్యలో కాలువ నీటి ఒత్తిడికి గురై పలుచోట్ల గండి పడే ప్రమాదం ఉండడంతో మల్యాల, బ్రాహ్మణకొట్కూరు పంప్‌హౌస్ కేంద్రాల మోటార్లను ఆపివేయించారు. మల్యాల ఎత్తిపోతల పథకం నుంచి గండిపడిన ప్రాంతం వరకు కాలువలో ఉన్ననీరు పూర్తిగా ఖాళీ అయితే తప్ప గండిపూడ్చే అవకాశం లేదు. నీటి పారుదల శాఖ అధికారులు సీఈ నాగరాజు, డీఈ హరిప్రసాద్ కాలువకు గండి పడిన ప్రాంతాన్ని పరిశీలించారు. సాధారణంగా ఎలుకలు కన్నాలు, వేసవిలో ఎండ తీవ్రతకు ఏర్పడ్డ చీలికల కారణంగా కాలువకు గండి పడే అవకాశాలు ఉన్నాయని ఇరిగేషన్ అధికారులు తెలిపారు. మల్లేపల్లె, కొంగనపాడు, లద్దగిరి గ్రామాల్లో కంది, పత్తి, మినుము పంటలు నీటమునిగాయని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు.

భక్తులకు ఏర్పాట్లలో నిర్లక్ష్యం వద్దు

ఉత్సవాలపై శ్రీమఠం, ప్రభుత్వ అధికారులతో ప్రత్యేక సమావేశం



ఉత్సవాలపై మాట్లాడుతున్న మఠం ఏఏవో మాధవశెట్టి

మంత్రాలయం, ఆగస్టు 5: మంత్రాలయం రాఘవేంద్రస్వామి 353వ సప్తరాత్రోత్సవాలు ఈ నెల 18 నుంచి 24వరకు జరిగే ఆరాధనోత్సవాల్లో భక్తుల ఏర్పాట్లపై నిర్లక్ష్యం వహించవద్దని మఠం ఏఏవో మాధవశెట్టి, మేనేజర్లు ఎస్‌కే శ్రీనివాసరావు, వెంకటేశ్ జోషీ తెలిపారు. సోమవారం సాయంత్రం మఠం పీఠాధిపతి సుబుధేంద్రతీర్థుల ఆదేశాల మేరకు టీటీడీ కళ్యాణ మండపంలో ఈ ఉత్సవాలపై శ్రీమఠం అన్ని శాఖల అధికారులు, ప్రభుత్వ అధికారులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. పెద్ద సంఖ్యలో హాజరయ్యే భక్తులకు తాగునీరు, వసతి, శుభ్రత, వైద్యం, బస్సు, రైళ్ల రవాణా సౌకర్యాలు, పార్కింగ్, ట్రాఫిక్, క్యూలైన్లు పరిమళ ప్రసాదాలు వంటి అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రధాన రోజుల్లో భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని ఏర్పాట్లు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో జోనల్ మేనేజర్ శ్రీపతాచార్, మెడికల్ అధికారి సుధేంద్రచార్, ఈఈ సురేష్ కోనాపూర్, పీఆర్వో ఐపీ నరసింహమూర్తి, ఎస్ఐ గోపీనాథ్ తదితరులు పాల్గొన్నారు.

వినతులు స్వీకరించిన స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు

కర్నూలు(కలెక్టరేట్), ఆగస్టు 5: కలెక్టరేట్ సునయన ఆడిటోరియంలో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో ప్రజల నుంచి వచ్చిన దరఖాస్తులను స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు చిరంజీవి, విశ్వనాథ్, నాగ ప్రసన్నలక్ష్మి స్వీకరించారు. సమస్యల పరిష్కారం చూపాల్సిందిగా సంబంధిత అధికారులను ఆదేశించారు.

ఇంకెన్నాళ్లు..?

- తహసీల్దార్ల స్థానాల కేటాయింపులో ఆలస్యం
- పోస్టింగుల కోసం కొందరి లాబీయింగ్
- నంద్యాల జిల్లాలో కొన్ని మండలాలు ఖాళీ

నంద్యాల, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): తహసీల్దార్లకు స్థానాల కేటాయింపుల విషయంలో భారీగా లాబీయింగ్ నడిచిందని తెలుస్తోంది. తమకు ఉన్న అన్ని పరిచయాలను ఉపయోగించుకుని తమకు అనుకూలంగా ఉన్న మండలాల్లో పోస్టింగులు వేయించుకునేందుకు ఆయా తహసీల్దార్లు విశ్వ ప్రయత్నాలు చేసినట్లు తెలుస్తోంది. ప్రభుత్వం తమను సొంత జిల్లాలకు పంపిస్తున్నదని తెలియగానే లాబీయింగ్ మొదలుపెట్టారు. ఇందుకోసం భారీగా డబ్బు సమర్పించుకునేందుకు కూడా కొంతమంది వెనుకాడలేదు. అయితే వారు కోరుకున్న చోటే పోస్టింగ్ ఇస్తే వారి గత చరిత్ర వల్ల ఏవైనా ఇబ్బందులు వస్తాయన్న ఉద్దేశంతో.. వారికి మద్దతునిచ్చే నాయకులు తటపటాయించారు. దీంతో ఆయా తహసీల్దార్లకు కాస్త అటు ఇటుగా వారికి అనుకూలంగా ఉన్న చోటే పోస్టింగులు ఇప్పించారు. ఉదాహరణకు నంద్యాల తహసీల్దారుగా వచ్చేందుకు ప్రయత్నించిన ఓ అధికారి చివరగా నంద్యాల కలెక్టరేట్‌లోనే పోస్టింగ్ దక్కించుకున్నట్లు సమాచారం.


సార్వత్రిక ఎన్నికలకు ముందు ఎన్నికల విధుల్లో భాగంగా జిల్లాకు చెందిన తహసీల్దార్లను రాయలసీమలోని ఇతర జిల్లాలకు బదిలీ చేశారు. ఎన్నికలు ముగియగానే ఆ తహసీల్దార్లను సొంత జిల్లాకు బదిలీ చేశారు. వారంతా వచ్చి జిల్లా యంత్రాంగానికి రిపోర్టు కూడా చేశారు. వీరిలో ఇప్పటికే కొంతమందికి పోస్టింగులు ఖరారు చేసినా, మిగిలిన వారికి ఇంకా స్థానాలను కేటాయించలేదు. ఇలా మిగిలిపోయిన వారు తమకు ఫలానా మండలం కావాలని గట్టిగా లాబీయింగ్ చేస్తున్నట్లు తెలుస్తోంది. అందుకే కొంతమంది పోస్టింగుల్లో ఆలస్యం అవుతున్నట్లు తెలుస్తోంది. పక్కనే ఉన్న కర్నూలు జిల్లాలోని తహసీల్దార్లకు పోస్టింగులు కేటాయించటమే కాకుండా, అందరికీ ఒకేసారి ఆర్డర్లు అందాయి. కానీ నంద్యాల జిల్లాలో మాత్రం విడతల వారీగా ఎందుకు ఆర్డర్లు వస్తున్నాయి? మిగిలిన వారికి ఎందుకు పోస్టింగులు ఇవ్వలేదన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి.

ఆ మంత్రి నిక్కచ్చిగా ఉంటారని..

జిల్లాలోని ఆయా తహసీల్దార్లకు జిల్లా యంత్రాంగం విడతల వారీగా స్థానాలను కేటాయించింది. అదికూడా కొంతమందికే కేటాయించడంతో ఇంకా దాదాపు 11 మండలాలకు తహసీల్దార్లను కేటాయించాలి. ముఖ్యంగా బనగానపల్లె లోని అన్ని మండలాలకు తహసీల్దార్లను కేటాయించాల్సి ఉంది. అయితే మిగిలి ఉన్న తహసీల్దార్లలో చాలామంది ఆ నియోజకవర్గానికి వెళ్ళేందుకు భయపడుతున్నారు. ఆర్అండ్‌బీ మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి సొంత నియోజకవర్గం కావడం, ఎలాంటి అవకతవకలు జరిగినా ఉపేక్షించరన్న పేరు ఆయనకు ఉండటంతో అధికారుల్లో గుబులు రేపుతోంది. గత ప్రభుత్వ హయాంలో ఆయనకు అధికారం లేకపోయినా, వైసీపీ నేతల మాటలు విని తప్పు చేసిన అధికారులను బీసీ జనార్దన్‌రెడ్డి ఉపేక్షించలేదు. అలాంటి అధికారుల మీద ఆయన కోర్టుకు సైతం వెళ్లిన ఘటనలున్నాయి. ప్రస్తుతం స్థానాల కేటాయింపులో భాగంగా బనగానపల్లె నియోజకవర్గంలో పోస్టింగ్ వస్తే నిక్కచ్చిగా పనిచేయాల్సి వస్తుంది. గత ప్రభుత్వంలో చేతి వాటాలకు అలవాటైన కొంతమంది అధికారులకు ఆ విషయం ఇబ్బందిని కలిగిస్తోంది. ఇక నంద్యాల, మహానంది, గోస్పాడు, డోన్, బండి ఆత్మకూరు వంటి మండలాలకు కూడా పోస్టింగులు ఖరారు చేయాల్సి ఉంది.



నంద్యాల కలెక్టరేట్



ముమ్మర ప్రయత్నాలు

తహసీల్దార్ల పరిస్థితి ఇలా ఉంటే కొన్ని చోట్ల డిప్యూటీ తహసీల్దార్లు ఆయా మండలాలకు తమనే ఇన్‌చార్జులుగా నియమించాలంటూ ఉన్నతాధికారులను ప్రసన్నం చేసుకునే పనిలో పడ్డారు. ఇప్పటికే ఓ ఇద్దరు అధికారులు కలెక్టర్ కార్యాలయం చుట్టూ తెగ ప్రదక్షిణలు చేస్తున్నారు. ఇందులో ఓ అధికారి ఏకంగా తనపై గతంలో ఉన్న ఆరోపణలకు సంబంధించి క్లీన్‌చిట్ తెచ్చుకోవటమే కాకుండా, ఉన్న చోటే ఇన్‌చార్జిగా పోస్టింగ్ ఆర్డర్లు తెచ్చుకునేందుకు విశ్వ ప్రయత్నాలు కూడా చేస్తున్నట్లు తెలుస్తోంది. ఈ విషయంలో ఆయన కాస్త మితిమీరి కూడా వ్యవహరించారు. ఆయనకు సంబంధించిన ఫైల్‌ను ఉన్నతాధికారులకు చేర్చే క్రమంలో ఫైల్ ఒక్కరోజు కనిపించకుండా పోయింది. ఫైల్ పైన సంతకాల గురించి ఆరా తీసే క్రమంలో తన ఫైల్ కనిపించకపోవటంతో తన తోటి డిప్యూటీ తహసీల్దార్‌తో కలిసి వెళ్లి సంబంధిత కార్యాలయంలో నానా హంగామా చేసినట్లు సమాచారం. గత ప్రభుత్వ హయాంలో వీరిద్దరూ పూర్తిగా వైసీపీకి సహకరించారు.

ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థకు 105 దరఖాస్తులు



ఫిర్యాదులు స్వీకరిస్తున్న అడిషనల్ ఎస్పీ

నంద్యాల క్రైం, ఆగస్టు 5: ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా ఆదేశాల మేరకు నంద్యాల జిల్లా బొమ్మలసత్రంలోని జిల్లా పోలీస్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ (పీజీఆర్ఎస్)కు వివిధ సమస్యలపై 105 దరఖాస్తులు వచ్చాయని అడిషనల్ ఎస్పీ కె. ప్రవీణ్‌కుమార్ తెలిపారు. జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ఫిర్యాదుదారులతో అడిషనల్ ఎస్పీ కె. ప్రవీణ్‌కుమార్ వినతులు స్వీకరించారు. ఆయన నేరుగా ఫిర్యాదుదారుల సమస్యలు తెలుసుకొని స్వయంగా సంబంధిత అధికారులతో ఫోన్‌లో మాట్లాడి చట్టపరిధిలో సత్వరమే పరిష్కారం చూపాలన్నారు. ఫిర్యాదులు పునరావృతం కాకుండా చూడాలని ఏఎస్పీ అధికారులను ఆదేశించారు. ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమానికి వచ్చినవాటిల్లో సివిల్ తగాదాలు, కుటుంబకలహాలు, అన్నదమ్ముల ఆస్తి పంపకాల్లో మనస్పర్థలు తదితరాలున్నాయని ఏఎస్పీ తెలిపారు. బండిఆత్మకూరు మండలం నారాయణపురం గ్రామానికి చెందిన రామలీలావతమ్మ హైదరాబాద్‌లోని ఉషోదయం కాలనీలో జీ-1 ఫ్లాట్ రూ.49లక్షలకు అమ్ముతానని చెప్పి తన వద్ద రూ.35లక్షలు తీసుకొని 4నెలల తర్వాత రిజిస్ట్రేషన్ చేయిస్తానని చెప్పి తనకు తెలియకుండా వేరేవాళ్లకు రిజిస్ట్రేషన్ చేయించారని ఈ విషయంలో న్యాయం చేయాలని నంద్యాలకు చెందిన ఎం. రామచంద్రయ్య ఏఎస్పీకి ఫిర్యాదు చేశారు. అలాగే వెలుగోడుకు చెందిన కార్పెంటర్ శివయ్య ఫర్నిచర్ తయారు చేయడానికి తనవద్ద రూ.40వేలు అడ్వాన్స్‌గా తీసుకొని 3నెలలు దాటినా ఫర్నిచర్ తయారుచేయకుండా తిప్పుతున్నాడని న్యాయం చేయాలని గిద్దలూరుకు చెందిన బి.గుండయ్య ఏఎస్పీకి ఫిర్యాదు చేశారు. ప్రకాశం జిల్లా మార్కాపురం మండలం రాయవరం జెడ్పీహైస్కూల్‌లో హిందీ టీచర్‌గా పనిచేస్తున్న షేక్ ఖాసింవలి అల్లా అనే వ్యక్తి కుటుంబ అవసరాల నిమిత్తం తనవద్ద రూ.7లక్షల పైచిలుకు అప్పుగా తీసుకున్నాడని నంద్యాలకు చెందిన షేక్ కరిముల్లా ఏఎస్పీ దృష్టికి తెచ్చారు. చాలామార్లు తన అప్పు చెల్లించాలని కోరగా కొంతమొత్తం తీర్చాడని మిగతా రూ.2,97,730 ఇవ్వకుండా ఉద్దేశపూర్వకంగా ఎగవేయాలని చూస్తున్నాడని తనకు న్యాయం చేయాలని ఏఎస్పీని ఆశ్రయించాడు.

రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి

హాలహర్వి, ఆగస్టు 5: మండలంలోని బాపురం గ్రామానికి చెందిన సురేష్ (29) రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. ఈ ఘటన సోమవారం జరిగింది. ఆదివారం రాత్రి బెంగళూరుకు కారులో వెళుతుండగా లారీ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో గాయపడిన సురేష్‌ను బళ్లారి ఆసుపత్రి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. చిన్న వయస్సులో ప్రమాదవశాత్తు సురేష్ మృతి చెందడంతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. మృతుడి కుటుంబాన్ని ఆలూరు ఎమ్మెల్యే విరుపాక్షి పరామర్శించి సంతాపం వ్యక్తం చేశారు.

ప్రమాదంలో ఆరుగురికి గాయాలు

దేవనకొండ, ఆగస్టు 5 : లారీ- కారు ఢీకొన్న ప్రమాదంలో ఆరుగురు తీవ్రంగా గాయపడ్డారు. హైదరాబాద్‌కు చెందిన మదన్‌మోహన్ తన కుటుంబ సభ్యులతో కలసి మహాబలేశ్వరం, గోకర్ణ దైవదర్శం ముగించుకొని తిరిగి హైదరాబాదుకు వెళ్తుండగా ఆదివారం రాత్రి కర్నూలు-బళ్లారి రహదారిపై కరివేముల సమీపంలో కర్నూలు నుండి వస్తున్న లారీ కారును ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో మదన్‌మోహన్, మనోహర్, విజయ, రాధిక, సవారమ్మలతో పాటు మరో చిన్నారి గాయపడ్డారు. వారిని కర్నూలు వైద్యశాలకు తరలించారు. కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

నిందితుల అరెస్టు

ప్యాపిలి, ఆగస్టు 5: పట్టణంలోని బీసీ కాలనీలో ఈ నెల 4న బలరాముడు అతని భార్య రంగమ్మ, కొడుకు పులి శేఖర్‌లపై వేట కొడవళ్లతో దాడి చేసి హత్యాయత్నానికి పాల్పడిన నిందితులను అరెస్టు చేసినట్లు సీఐ సుధాకర్‌రెడ్డి తెలిపారు. సోమవారం స్థానిక సర్కిల్ కార్యాలయంలో నిందితులను విలేకర్ల సమావేశంలో హాజరుపరిచారు. నిందితులు కమలాకర్, శేఖర్, కళ్యాణ్, దివాకర్, లక్ష్మి, సునిత అరెస్టు చేసినవారిలో ఉన్నారు. పొలం బోరు విషయంలో మూడు నెలల క్రితం కమలాకర్, బలరాముడు కుటుంబాల మధ్య ఘర్షణ జరిగింది. కమలాకర్ ఈ గొడవ దృష్టిలో పెట్టుకొని బలరాముడు కుటుంబంపై కత్తులతో దాడి చేసి హత్యాయత్నానికి పాల్పడినట్లు సీఐ తెలిపారు. అరెస్టు చేసిన వారిని రిమాండ్‌కు పంపామన్నారు.నిందితులను అరెస్టు చేసిన రాచెర్ల ఎస్ఐ చంద్రమోహన్, సిబ్బందిని ఎస్పీ అభినందించినట్లు సీఐ సుధాకర్‌రెడ్డి తెలిపారు.

గురు రాఘవేంద్ర పంప్‌హౌస్‌లో పరికరాలు ధ్వంసం

- బసలదొడ్డి స్టేజీ పంప్‌హౌస్‌కు రూ.12 లక్షల నష్టం
- 8 రోజులు గడవకముందే మరో విధ్వంసం



ధ్వంసమైన ఫీడర్

మంత్రాలయం, ఆగస్టు 5: కర్నూలు జిల్లా మంత్రాలయంలో తుంగభద్ర నది ఒడ్డున ఉన్న గురురాఘవేంద్ర ప్రాజెక్టు (జీఆర్‌పీ) బసలదొడ్డి రిజర్వాయరు పంప్‌హౌస్ స్టేజీ-1పై దుండగులు ఇంజన్లను, స్టాటర్లు, కెపాసిటర్లను పగులకొట్టి, అందులో కాపర్‌ను దోచుకెళ్లారు. ఆదివారం అర్ధరాత్రి గుర్తు తెలియని వ్యక్తులు మాధవరం సమీపంలో ఉన్న గురు రాఘవేంద్ర పంప్ హౌస్ ముందుబాగంలో ఉన్న షట్టర్‌ను గడ్డపారలతో పగులకొట్టి లోపలికి ప్రవేశించారు. ఇంజన్‌లో ఉన్న 100 కేవీఏ ఫీడర్లు కెపాసిటర్లు, పంప్‌బేరింగ్ ప్లేట్లు, కాపర్‌పైపు, తదితర వస్తువులను పగులకొట్టి అందులో కాపర్ ప్లేట్లను ఎత్తుకెళ్లే ప్రయత్నం చేశారు. అయితే గస్తీలో తిరుగుతున్న పోలీసు వాహనాన్ని చూసి కాపర్ ప్లేట్లను ఎత్తుకెళ్లి పంప్‌హౌస్ నుంచి 500 మీటర్ల దూరంలో ఉన్న పత్తిపంటలో పడేశారు. విషయం తెలుసుకున్న ఆపరేటర్లు, జీఆర్‌పీ అధికారులు ఈఈ భాస్కర్ రెడ్డి, డీఈ కృపానిధి, ఏఈ హరిప్రసాద్‌కు సమాచారం ఇవ్వడంతో సోమవారం ఉదయం మంత్రాలయం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీంతో డీఎస్పీ శివనారాయణ స్వామి, ఆదోని టూటౌన్ సీఐ గోపి, స్పెషల్ బ్రాంచ్ ఎస్ఐ వేణుగోపాల్‌రాజు, మంత్రాలయం సీఐ రామాంజులు, మాధవరం ఎస్ఐ కృష్ణమూర్తిలు పరిశీలించి డాగ్ స్క్వాడ్, క్లూజ్ టీమ్‌తో విచారణ చేపట్టి వేలిముద్రలు సేకరించారు. చోరీకి ముందుగానే దుండగులు ఒక చొక్కా, టవల్‌ను అక్కడే వదిలేశారు. ఆ చొక్కాపై కర్ణాటకలోని శక్తినగర్ అనే ఊరి టైలర్ పేరు ఉన్నట్లు గుర్తించారు. అదేవిధంగా వారి వద్ద ఉన్న టవల్ స్వాధీనం చేసుకున్నారు. 500 మీటర్ల దూరంలో పత్తి పొలంలో పోలీసులను చూసి పరారై పంప్ కాపర్ వైరు, బేరింగ్ ప్లేట్లను పడేసి వెళ్లారు. దీంతో గుర్తించి పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఈ చోరీకి పాల్పడింది కర్ణాటక వ్యక్తులు అయి ఉండవచ్చని పోలీసులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. గత 8 రోజుల క్రితం జీఆర్‌పీలోని మాధవరం పంప్‌హౌస్ స్టేజీ-1 ధ్వంసం జరిగిన సంఘటన మరువక ముందే మళ్లీ బసలదొడ్డి రిజర్వాయరు పంప్‌హౌస్‌ను బద్దలుకొట్టి చోరీ జరగడంతో సర్వత్రా చర్చనీయాంశంగా మారింది.

ధ్వంసంపై సీఐడీతో విచారణ జరిపించాలి



వారం రోజుల్లో గురు రాఘవేంద్ర మాధవరం పంప్ హౌస్-1, బసలదొడ్డి రిజర్వాయర్ పంప్‌హౌస్‌లో రాజకీయ కుట్రలు, కసితో విధ్వంసం చేసిన సంఘటన మరవక ముందే ఆదివారం అర్ధరాత్రి బసలదొడ్డి రిజర్వాయర్‌స్టేజ్-1 విధ్వంసం చేసి పరికరాలు చోరీయత్నం చేసిన దుండగులపై సీఐడీ విచారణ చేయాలని టీడీపీ జిల్లా అధ్యక్షుడు పాలకుర్తి తిక్కారెడ్డి అన్నారు. రెండు ప్రాజెక్టులు విధ్వంసం కావడంతో రైతులకు తీవ్ర నష్టం జరిగిందని ఆయన అన్నారు. పోలీసులు కేసు చేధించలేకపోతున్నారనీ సీఐడీకి అప్పగించి ధ్వంసానికి కారకులైన వారిని వెంటనే పట్టుకుని కఠినంగా శిక్షించి ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా చూడాలన్నారు.

- పాలకుర్తి తిక్కారెడ్డి, టీడీపీ జిల్లా అధ్యక్షుడు



తుంగభద్ర నది ఒడ్డున బసలదొడ్డి రిజర్వాయర్ పంప్‌హౌస్



పంప్‌హౌస్ షట్టర్‌ను పగులకొట్టిన దృశ్యం



దోచుకెళ్లిన పరికరాలు

ప్రారంభమైన శ్రావణ ఉత్సవాలు

- స్వామి దర్శనానికి పోటెత్తిన భక్తులు
- సౌకర్యాలు కల్పించడంలో అధికారులు విఫలం



ఎండలోనే స్వామి దర్శనం కోసం నిల్చుకున్న భక్తుల క్యూలైన్

కౌతాళం, ఆగస్టు 5: ఉరుకుంద ఈరన్న స్వామి సన్నిధిలో శ్రావణ మాస ఉత్సవాలు సోమవారం ఆరంభమయ్యాయి. భక్తులు స్వామి దర్శనానికి వేలాది సంఖ్యలో తరలి వచ్చి మొక్కుబడులు తీర్చుకున్నారు. అర్చకులు స్వామి వారి మూలవిరాట్‌కు వెండి ఆభరణాలతో అలంకరించారు. ఉత్సవాలు ప్రారంభానికి ముందే సౌకర్యాలు కల్పించాల్సిన అధికారులు వేలాలు వాయిదాలు పడటంతో పూర్తి స్థాయిలో ఏర్పాట్లు చేయలేకపోయారు. చివరికి సరైన నీటి సౌకర్యం కూడా కల్పించలేకపోయారు. ముఖ్యంగా చంటి పిల్లల తల్లులకు క్యూలైన్లలో కూర్చునే సౌకర్యం లేక ఇబ్బందిపడ్డారు. ప్రత్యేక క్యూలైన్లలో భక్తులకు ఎండ నుంచి ఉపశమనం కోసం షామియాలు ఏర్పాట్లు చేయలేదు. స్వామి దర్శనానికి మన రాష్ట్రం నుంచే కాక కర్ణాటక, తెలంగాణ నుంచి భక్తులకు అధిక సంఖ్యలో తరలిరావడంతో ఆలయ పరిసరాలు భక్తులతో కిక్కిరిసినది.

ఈఓ సెలవుపై వెళ్ళడంతో అస్తవ్యస్తంగా తయారైన పాలన

ఉత్సవాల ఏర్పాట్లలో నిమగ్నమైన మాజీ ఆలయ డిప్యూటీ కమిషనర్ హెజీ వెంకటేష్ ఉన్నట్టుండి ఆదివారం మధ్యాహ్నం 20 రోజుల పాటు సెలవులపై వెళ్ళడంతో ఉత్సవాల ఏర్పాట్లు అస్తవ్యస్తంగా తయారయ్యాయి. అధికార పార్టీ నాయకులు, ఆలయ అర్చకుల ఒత్తిడితోనే ఆయన సెలవులో వెళ్ళినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఆదివారం డీసీగా బాధ్యతలు చేపట్టిన గురుప్రసాద్ ఉత్సవాలకు కొత్త కావడంతో కొంత మంది వ్యాపారుల ఆటలకు అడ్డులేకపోయింది.



ఆలయ ముఖద్వారంలోనే కొబ్బరి చిప్పలు పడివున్న దృశ్యం

టెంకాయ చిప్పలు ఎవరికి?

స్వామి వారికి భక్తులు సమర్పించే టెంకాయలను సరఫరా చేసేందుకు టెండర్లు కోర్టు పరిధిలో ఉండగా కొంత మంది ప్రైవేటు వ్యక్తులు వ్యాపారులకు టెంకాయలను సరఫరా చేస్తున్నారు. అయితే కొబ్బరి చిప్పల సేకరణకు వేలాలు లేకపోవడంతో ప్రస్తుతం వీటిని ఎవరు పోగు చేసుకుంటున్నదీ అర్థం కావడం లేదు. దీంతో ఆలయ ఆదాయానికి బారీగా గండిపడే ప్రమాదం ఉంది.

మిస్టరీ వీడిన హత్య కేసు

ఆస్పరి, ఆగస్టు 5: ఎమ్మిగనూరు మండలం మసీదుపురం గ్రామానికి చెందిన కురువ పెంటయ్య (45) హత్య కేసులోని మిస్టరీ వీడింది. ఆలూరు మండలం హాలేబీడు గ్రామం వద్ద ముగ్గురు దుండగులు పెంటయ్యకు మత్తు మందు ఇచ్చి అతని వద్ద నుంచి రూ.7.5 లక్షలు తీసుకుని హత్య చేసి ఆస్పరి మండలం చిన్నహోతూరు గ్రామ సమీప వంకలో వారం రోజులు కిందట డ్రమ్ములో కుక్కి పడేసిన విషయం విదితమే. గుర్తుతెలియని శవంగా ఆస్పరి అప్‌గ్రేడ్ సీఐ హనుమంతప్ప కేసు నమోదు చేశారు. కేసు పూర్వాపరాల పరిశీలనలో.. ఎమ్మిగనూరు ఆటోవాలా ఇచ్చిన సమాచారం మేరకు మూడు గ్రామాలకు చెందిన ముగ్గురు వ్యక్తులు డబ్బు కోసం పెంటయ్యను హతమార్చినట్లు విచారణలో తేలింది. ఈ కేసును ఛేదించడంలో కీలకంగా పని చేసిన ఆస్పరి పత్తికొండ, దేవనకొండ అప్‌గ్రేడ్ పోలీస్‌స్టేషన్ల సీఐలు హనుమంతప్ప, మురళీమోహన్, శ్రీనివాసులుతోపాటు ఆలూరు, హాలహర్వి పోలీసు స్టేషన్ల ఎస్ఐలు ఓబులేశు, నరేంద్ర, స్థానిక పోలీసు సిబ్బందికి పోలీసు ఉన్నతాధికారులు రివార్డు ప్రకటించి అందజేశారు.

వడ్డీ వ్యాపారి ఇంటి ముందు

బైఠాయించిన బాధితులు

పురుగు మందు డబ్బాలతో వడ్డీ వ్యాపారి ఇంటికి వెళ్లిన వైనం

ఎమ్మిగనూరు, ఆగస్టు5: పట్టణంలోని గాంధీనగర్‌లో నివాసం ఉంటున్న వడ్డీ వ్యాపారి రాజేష్‌గౌడు ఇంటి ముందు బాధితులు పురుగు మందు డబ్బాలతో బైఠాయించి ఆందోళనకు దిగారు. ఈ సంఘటన సోమవారం చోటు చేసుకుంది. బుడగ జంగం కాలనీలో నివాసం ఉంటున్న బుడగ జంగాల రంగన్నకు కర్నూలు బైపాసు రోడ్డులో 30సెంట్ల స్థలం ఉంది. ఆ స్థలాన్ని పట్టణానికి చెందిన రాజేష్ గౌడు దగ్గర తనఖా పెట్టి వడ్డీకి కొంత డబ్బు అప్పు తీసుకున్నాడు. ఈ విషయంలో వివాదం చెలరేగడంతో సోమవారం రంగన్న భార్య మహాలింగమ్మ, అన్న కుమార్తె మైసమ్మ, కుమారుడు జోగి పురుగు మందు డబ్బాలతో రాజేష్ గౌడు ఇంటి ముందు బైఠాయించి ఆందోళనకు దిగారు. అనంతరం రాజేష్‌గౌడు బంధువు శ్రీనివాసగౌడు వచ్చి బాధితులకు నచ్చజెప్పి మీకు న్యాయం జరిగేలా చూస్తానని హామీ ఇవ్వడంతో బాధితులు శాంతించి అక్కడి నుంచి వెళ్లిపోయారు. ఈ సంఘటనపై పట్టణ సీఐ సుదర్శన్‌రెడ్డిని వివరణ కోరగా.. ఈ విషయంలో విచారించి చర్యలు తీసుకుంటామన్నారు.

పదో తరగతి విద్యార్థిని ఆత్మహత్య

- మంత్రాలయం మోడల్ స్కూల్‌లో ఘటన
- విద్యార్థిని తల్లిదండ్రులకు న్యాయం చేస్తామన్న సబ్ కలెక్టర్, డీఈవో, డీఎస్పీలు



పార్వతి (ఫైల్)

మంత్రాలయం, ఆగస్టు 5: మంత్రాలయం మండలంలోని రచ్చుమర్రి సమీపంలో ఉన్న మోడల్ స్కూల్‌లో పదో తరగతి చదువుతున్న పార్వతి (15) ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. ఈ సంఘటన ఆదివారం అర్ధరాత్రి జరిగింది. కురువ గుండప్ప, భీమలింగమ్మ దంపతులకు ముగ్గురు సంతానం. ఆఖరి కూతురు పార్వతిని మోడల్ స్కూల్ హాస్టల్‌లో చేర్పించి, వారు బతుకుతెరువు కోసం హైదరాబాదుకు వలస వెళ్లారు. పార్వతి ఆదివారం రాత్రి భోజనం చేసి సోమవారం యూనిట్ టెస్టు ఉన్న కారణంగా చదువుకుంటానని ప్రత్యేక గదిలో రాత్రంతా చదువుకుంది. సోమవారం ఉదయం చూసేసరికి ఫ్యాన్‌కు తన చున్నీతో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకొని కనిపించింది. విద్యార్థులు వార్డెన్‌కు, ప్రిన్సిపాల్‌కు సమాచారం ఇచ్చారు. డీఎస్పీ శివనారాయణ స్వామి మాధవరం ఎస్ఐ కృష్ణమూర్తి, ఇన్‌చార్జి సీఐ ఎమ్మిగనూరు టౌన్ సుదర్శన్ రెడ్డి కొత్తగా సీఐగా బాధ్యతలు తీసుకున్న రామాంజులు ఘటనా స్థలానికి వెళ్లి బాలిక మృతదేహాన్ని కిందకు దించి ఆసుపత్రికి తరలించారు. హైదరాబాదు నుంచి తల్లిదండ్రులు వచ్చేలోపే మృతదేహాన్ని పోస్టుమార్టానికి తరలిస్తుండగా.. బంధువులు అడ్డుకుని సంఘటనా స్థలానికి చేర్చారు. ప్రజా సంఘాల నాయకులు, ఏఐఎస్ఎఫ్, పీడీఎస్‌యు విద్యార్థి సంఘాల నాయకులు రాస్తారోకో చేసి ధర్నా చేశారు. విద్యార్థినికి మృతికి గల కారణాలు తెలపాలని, మృతురాలి కుటుంబానికి రూ.20 లక్షలు ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలని, వారి కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలని ధర్నా చేశారు. అక్కడకు వచ్చిన సబ్ కలెక్టర్ శివనారాయణ శర్మ, డీఈవో శామ్యూల్, డీఎస్పీ శివనారాయణ స్వామిలను అడ్డుకున్నారు.

బాలిక కుటుంబానికి న్యాయం చేస్తాం

ఆత్మహత్య చేసుకకున్న పార్వతి మృతికి గల కారణాలు, అన్ని కోణాల్లో దర్యాప్తు చేసి నిగ్గు తేలుస్తామని సబ్ కలెక్టర్ శివ్‌నారాయణ శర్మ, డీఈవో శామ్యూల్ అన్నారు. బాలిక కుటుంబానికి అన్ని విధాలుగా ప్రభుత్వం అండగా ఉంటుందన్నారు. అక్కడే ఉన్న ప్రిన్సిపాల్ ప్రసాద్, వార్డెన్ సుజాతలను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఒంటరిగా ఒక గదిలో బాలిక ఎందుకు ఉందని, సీసీ కెమెరాలు ఎందుకు పని చేయడం లేదని ప్రశ్నించారు. ప్రిన్సిపాల్, వార్డెన్లు నీళ్ల నమిలారు. ఇది చూసి తల్లిదండ్రులు కోపోద్రిక్తులై తమ కూతురు మృతికి కారకులైన వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. మాజీ సింగిల్ విండో అధ్యక్షుడు ప్రదీప్‌రెడ్డి, టీడీపీ నాయకులు రామకృష్ణారెడ్డి, సంఘటనా స్థలానికి చేరుకుని బాలిక మృతదేహాన్ని పరిశీలించి భరోసా ఇచ్చారు.



రోదిస్తున్న తల్లిదండ్రులు, బంధువులు

కర్నూలు డీఎస్పీగా జే.బాబు ప్రసాద్


డీఎస్పీగా బాధ్యతలు స్వీకరిస్తున్న బాబు ప్రసాద్

కర్నూలు, ఆగస్టు 5: కర్నూలు డీఎస్పీగా జే. బాబు ప్రసాద్ సోమవారం సాయంత్రం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ డీఎస్పీగా పని చేసిన కే. విజయ శేఖర్ ఏపీ హెడ్ క్వార్టర్స్‌కు బదిలీ అయ్యారు. నూతన డీఎస్పీగా బాధ్యతలు చేపట్టిన డీఎస్పీ బాబు ప్రసాద్ గతంలో కర్నూలు టూటౌన్, ఆత్మకూరు పోలీస్ స్టేషన్, కర్నూలు స్పెషల్ బ్రాంచ్, కర్నూలు ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్‌లలో సీఐగా పని చేశారు. అలాగే డీఎస్పీగా కర్నూలు స్పెషల్ బ్రాంచ్, నెల్లూరు జిల్లాలో గూడూరు పోలీస్‌స్టేషన్, చిత్తూరు దిశా పోలీస్‌స్టేషన్‌లలో పని చేశారు. ఈ ఏడాది ఫిబ్రవరి కర్నూలు మహిళా పోలీస్‌స్టేషన్ డీఎస్పీగా నియమితులయ్యారు. ఇటీవల జరిగిన డీఎస్పీ బదిలీల్లో భాగంగా ఆయన కర్నూలు డీఎస్పీగా నియమితులయ్యారు. బాధ్యతలు స్వీకరించిన ఈయనకు నగరంలోని పలువురు సీఐలు స్వాగతం పలికారు.

చికిత్స పొందుతూ రైతు మృతి

కోడుమూరు(రూరల్), ఆగస్టు 5: మండలంలోని క్రిష్ణాపురంలో అప్పుల బాధతో పురుగుల మందు తాగిన రైతు చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడు. కుటుంబసభ్యులు, పోలీసుల వివరాల మేరకు.. గ్రామానికి చెందిన ఉప్పరి పరమేష్ (50)కు 4 ఎకరాల పొలం ఉంది. పరమేష్ వ్యవసాయం చేసుకుంటూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. అయితే గత 5 ఏళ్ల నుంచి పంట పెట్టుబడుల కూడా అందకపోవడంతో సుమారు రూ. 30 లక్షల అప్పు అయ్యింది. దీంతో ఇటీవలే 2.50 ఎకరాల పొలం విక్రయించి చెల్లించినా అప్పు తీరలేదు. ఈ మనోవేదనతో ఈ నెల 3న సాయంత్రం కల్లందొడ్డిలో పురుగుల మందు తాగాడు. భార్య శాంతమ్మ కుటుంబసభ్యుల సాయంతో భర్తను కోడుమూరు ప్రభుత్వాసుపత్రికి తరలించింది. అక్కడ ప్రాథమిక చికిత్స అనంతరం కర్నూలు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అయితే చికిత్సలో కోలుకోలేక సోమవారం మధ్యాహ్నం రైతు మృతి చెందాడు. మృతుడి భార్య శాంతమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ బాలనరసింహులు తెలిపారు.

క్షతగాత్రుడికి ఎమ్మెల్యే కోట్ల పరామర్శ

కర్నూలు(హాస్పిటల్), ఆగస్టు 5: పొలం తగాదాలో తీవ్రంగా గాయపడి కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ప్యాపిలికి చెందిన పులిశేఖర్‌ను డోన్ ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి పరామర్శించారు. సోమవారం ఆయన ఏఎంసీలోని ఎస్ఐసీయులో తీవ్రంగా గాయపడి చికిత్స తీసుకుంటున్న రోగి ఆరోగ్య పరిస్థితిని జనరల్ సర్జరీ ఆరవ యూనిట్ చీఫ్ డా.జే. జయరాం ఎమ్మెల్యేకు వివరించారు. రోగికి మెరుగైన సేవలు అందించాలని ఆయన కోరారు.

మఠం భూములను కాపాడండి

కల్లూరు, ఆగస్టు 5: కల్లూరు మండలం ఏ. గోకులపాడు సర్వే నెం.87లోని 10 ఎకరాల మఠం భూములు అన్యాక్రాంతం కాకుండా కాపాడాలని బీజేపీ నాయకులు శింగం సోమశేఖర్‌రెడ్డి డిమాండ్ చేశారు. సోమవారం బీజేపీ సభ్యులు బృందం కల్లూరు తహసీల్దారు కార్యాలయంలో ఎమ్మార్వో కే.రామాంజనేయులుకు వినతిపత్రం అందించారు. బీజేపీ మండల అధ్యక్షుడు సోమయాచారి, వీరప్ప, హేమసుందర్‌రెడ్డి, తారకేశ్వరరెడ్డి, రవికుమార్, మదన్‌మోహనాచారి పాల్గొన్నారు.

తహసీల్దార్‌ను సన్మానించిన టీడీపీ నాయకులు

కోడుమూరు(రూరల్), ఆగస్టు 5: కోడుమూరు తహసీల్దార్ వెంకటేష్‌నాయక్‌ను వివిధ గ్రామాలకు చెందిన టీడీపీ నాయకులు సన్మానించారు. ఇటీవల బదిలీ నియామకాల్లో భాగంగా తహసీల్దార్ వెంకటేష్‌నాయక్‌ను కోడుమూరుకు నియమించిన సంగతి తెలిసిందే. దీంతో సోమవారం ప్యాలకుర్తి, వర్కూరు గ్రామాలకు చెందిన పలువురు టీడీపీ నాయకులు తహసీల్దార్ వెంకటేష్‌నాయక్‌ను మర్యాదపూర్వకంగా కలిసి పూలమాల, దుశాలువా కప్పి సన్మానించారు.

డ్రంకెన్ డ్రైవ్‌లో ఆరుగురికి జైలు శిక్ష

కర్నూలు, ఆగస్టు 5: డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుబడిన ఆరుగురుకి కోర్టు మూడు రోజులు జైలు శిక్ష విధించింది. ట్రాఫిక్ డీఎస్పీ గౌతమి ఆధ్వర్యంలో రెండు రోజుల క్రితం డ్రంకెన్ డ్రైవ్ నిర్వహించగా.. ఆరుగురు మద్యం సేవించి వాహనాలు నడుపుతూ పోలీసులకు చిక్కారు. వారిని సోమవారం కోర్టులో హాజరు పరచగా.. కోర్టు వారికి మూడు రోజుల జైలు శిక్ష విధించింది.

20 లీటర్ల నాటుసారా స్వాధీనం

కర్నూలు, ఆగస్టు 5: టూటౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో బంగారుపేట, కేసీ కెనాల్ బ్రిడ్జి ప్రాంతాల్లో నాటుసారా విక్రయిస్తున్న జోగి అనే వ్యక్తిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అతని వద్ద నుంచి 20 లీటర్ల నాటుసారా స్వాధీనం చేసుకున్నారు. వీరిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు పంపినట్లు సీఐ నాగరాజు రావు తెలిపారు.

15 లీటర్ల నాటుసారా..

కోడుమూరు(రూరల్): కోడుమూరు సెబ్ స్టేషన్ పరిధి లోని చిట్యాలలో 15 లీటర్ల నాటుసారాను స్వాధీనం చేసుకున్నారు. ఈసందర్భంగా సెబ్ సీఐ రామాంజనేయులు మాట్లాడుతూ తనిఖీల్లో భాగంగా సోమవారం చిట్యాలలో అడవి మాదన్న అనే వ్యక్తి నుంచి 15 లీటర్ల నాటుసారాను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. నిందితుడిపై కేసు నమోదు చేసి రిమాండ్ తరలించినట్లు సీఐ చెప్పారు. తనిఖీల్లో సెబ్ ఎస్ఐ అలీబేగ్ సిబ్బంది అన్సార్ బాషా, వీరుపాక్షిరెడ్డి, శంకర్ నాయక్, సువర్ణమ్మ పాల్గొన్నారు.

ముస్లింల సమస్యల పరిష్కారానికి కృషి

కర్నూలు(న్యూసిటీ), ఆగస్టు 5: ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలలో ముస్లింల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఉమ్మడి రాష్ట్రాల అధ్యక్షుడు షేక్ హఫీజ్ కరీముల్లా అన్నారు. సోమవారం స్కంద కాంప్లెక్స్‌లోని కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మూడు రోజులు క్రితం మంచ్ జాతీయ అధ్యక్షుడు ఇంద్రీష్‌కుమార్ ఉమ్మడి రాష్ట్రాల అధ్యక్షుడిగా తనను నియమించడం సంతోషంగా ఉందన్నారు. ఉమ్మడి రాష్ట్రాలలో కొత్త కమిటీలను ఏర్పాటు చేస్తామన్నారు.

సుందరీకరణ పేరుతో రూ.కోటి ప్రజాధనం వృథా

కర్నూలు(కలెక్టరేట్), ఆగస్టు 5: నగరంలోని సుందరీకరణ పేరుతో దాదాపు రూ.కోటి ప్రజాధనం వృథా అయిందని, దీనిపై సమగ్ర విచారణ జరపాలని పట్టణ పౌర సంక్షేమ సంఘం డిమాండ్ చేశారు. సోమవారం పట్టణ పౌర సంక్షేమ సంఘం నాయకులు కలెక్టరేట్‌లోని ప్రజా సమస్యల పరిష్కార వేదికలో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ విశ్వనాథ్‌కు వినతి పత్రం సమర్పించారు.

కార్మికులను రెగ్యులర్ చేయాలి


ఎస్ఈకి వినతిపత్రం ఇస్తున్న యూనియన్ నాయకులు

కల్లూరు, ఆగస్టు 5: విద్యుత్‌శాఖలో కాంట్రాక్, ఇవుట్ సోర్సింగ్ కార్మికులందరినీ రెగ్యులర్ చేయాలని యునైటెడ్ ఎలక్ట్రిసిటీ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్(సీఐటీయూ) జిల్లా ప్రతినిధి బృందం కె.భీమేష్, ప్రవీణ్‌కుమార్ కోరారు. సోమవారం ఏపీ ఎస్పీడీసీఎల్ కంపెనీ కమిటీ ఉపాధ్యక్షుడు పి.నాగరాజు ఆధ్వర్యంలో ఆశాఖ ఎస్ఈ ఎం. ఉమాపతికి వినతిపత్రం అందించారు. రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా ఈ నెల 2 నుంచి 5 వరకు జిల్లాల ఎస్ఈలకు వినతిపత్రాలు ఇవ్వాలని ఈ నెల 19న డిస్కంల సీఎండీలకు అదేవిధంగా 28న మూడు డిస్కంలు, ఎస్ఈ కార్యాలయాల ముందు దీక్షలకు పిలునిచ్చారని స్పష్టం చేశారు.

ఘనంగా మంత్రి టీజీ భరత్ జన్మదిన వేడుకలు





గాయత్రీ గోశాలలో మంత్రి టీజీ భరత్, కుటుంబ సభ్యులు, టీజీ భరత్‌కు పూల మొక్కలు అందజేసి జన్మదిన శుభాకాంక్షలు తెలుపుతున్న ఎమ్మెల్యే గౌరు చరిత, గౌరు వెంకటరెడ్డి, ధర్మపేటలో ప్రజలకు టిఫిన్ బాక్స్‌లు అందజేస్తున్న సోమిశెట్టి హరిక్రిష్ణ, టీజీ భరత్‌ను సత్కరిస్తున్న సోమిశెట్టి హరిక్రిష్ణ, రియల్‌టైమ్ నాగరాజు యాదవ్

కర్నూలు(అర్బన్), ఆగస్టు 5: నగర శివారులోని గాయత్రీ గోసంరక్షణ శాలలో రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా మంత్రి టీజీ భరత్ మాట్లాడుతూ గోమాతకు సేవ చేస్తే అంతా మంచి జరుగుతుందన్నారు. అనంతరం ఆయన కుటుంబ సభ్యులతో కలిసి గోశాలలో పూజలు చేశారు. ఆ తర్వాత చండీ, ఆయుష్ హోమం చేశారు. అనంతరం గోవులకు గ్రాసం పెట్టారు. అంతకుముందు మంత్రి నివాసంలో టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సోమిశెట్టి వెంకటేశ్వర్లు, సోమిశెట్టి నవీన్‌లు ఆయన్ను కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

● మంత్రి టీజీ భరత్ జన్మదినాన్ని పురస్కరించుకుని ఆయన అభిమానులు, పార్టీ నాయకులు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. గాయత్రీ గోశాలలో లక్కి-2 యూత్ గోపినాథ్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. అనంతరం చీరల పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టారు. అనంతరం పలువురు విరాళాలు అందజేశారు. మహిళా శిశు సంక్షేమ శాఖ జిల్లా మహిళా ప్రాంగణంలో టీడీపీ వీరశైవ సాధికార సమితి రాష్ట్ర కన్వీనర్ శివరాజు ఆధ్వర్యంలో నాయకులు మొక్కలు నాటారు. నగరంలోని అరుంధతి నగర్‌లో టీడీపీ నాయకులు లంచ్ బాక్సులు పంపిణీ చేశారు.

ప్రభుత్వాసుపత్రిలో రోగులకు పండ్లు పంపిణీ: మంత్రి టీజీ భరత్ జన్మదినం సందర్భంగా కర్నూలు ప్రభుత్వాసుపత్రిలో ఆయన అభిమానులు రోగులకు పండ్లు పంపిణీ చేశారు. టీడీపీ రాష్ట్ర మైనార్టీ ఆర్గనైజింగ్ సెక్రటరీ మన్సూర్ ఆలీఖాన్, ఆసుపత్రి సూపరింటెండెంట్ డా.ప్రభాకర్ రెడ్డితో కలిసి టీబీ వార్డులో రోగులకు పండ్లు అందజేశారు. అనంతరం నాయకులంతా సుంకేసుల రోడ్డులో మొక్కలు నాటారు. ఆ తర్వాత రోజా, మరియధన్ దర్గాల్లో అన్నదానం చేశారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు పరమేష్, నిలోఫర్ పాల్గొన్నారు. అదే విధంగా 44వ వార్డు టీడీపీ నాయకుడు భీమ్‌శెట్టి మనోజ్ టీజీ భరత్ 47 అడుగుల కటౌట్ ఏర్పాటు చేసి 47 కేజీల పచ్చిగడ్డి, 47 కేజీల దాన, 47 కేజీల పూలదండ, 47 కేజీల అరటిలతో ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టారు. భీమ్‌శెట్టి రమేష్, షణ్ముఖ, హరిబ్రహ్మయ్య, హుసేన్ పాల్గొన్నారు.

టీజీ భరత్‌కు శుభాకాంక్షలు తెలిపిన ప్రముఖులు: మంత్రి టీజీ భరత్‌కు పాణ్యం, కోడుమూరు ఎమ్మెల్యేలు గౌరు చరితారెడ్డి, బొగ్గుల దస్తగిరి, సీనియర్ నాయకుడు గౌరు వెంకటరెడ్డి, టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సోమిశెట్టి వెంకటేశ్వర్లు, సోమిశెట్టి నవీన్‌లు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. వివిధ రంగాలకు చెందిన ప్రముఖులు, స్వచ్ఛంద సంస్థల నిర్వాహకులు, అధికారులు ఆయన్ను కలిసి శుభా కాంక్షలు తెలిపారు.

ధర్మపేటలో పేదలకు టిఫిన్ బాక్స్‌ల పంపిణీ

కర్నూలు(రూరల్): నగరంలో మంత్రి టీజీ భరత్ జన్మదిన వేడుకలను ఆయన అభిమానులు, టీడీపీ నాయకులు ఘనంగా నిర్వహించారు. టీడీపీ యువ నాయకులు సోమిశెట్టి హరిక్రిష్ణ, సోమిశెట్టి శ్రీకాంత్ ఆధ్వర్యంలో ధర్మపేటలో 1200మంది నిరుపేదలకు టిఫిన్ బాక్స్‌ల పంపిణీ చేశారు. అనంతరం ప్రజల మధ్య కేక్‌ను కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు నాగరాజు యాదవ్ పాల్గొన్నారు. అనంతరం నగరంలోని గుత్తిరోడ్డు గోశాలలో మంత్రి టీజీ భరత్‌ను కలిసి సోమిశెట్టి హరిక్రిష్ణ, రియల్ టైమ్ నాగరాజు యాదవ్ కలిసి శాలువతో సత్కరించారు. కార్యక్రమంలో అశ్రఫ్, వేణుగోపాల్ రెడ్డి, కిరణ్, ప్రవీణ్, నాసిర్, సురేష్, తనిష్క్, వేణు, బాషా పాల్గొన్నారు.

'శిల్ప కళాకారులను ప్రోత్సహించాలి'

కర్నూలు(కల్చరల్): నూతన భవనాలపై కళాకృత్యాలు, దేవుళ్ల చిత్రాలు, ఎంబోజింగ్ వర్క్స్, ఆర్చీలు, గుడి నిర్మాణాలు చేపట్టే శిల్ప కళాకారులను ప్రభుత్వం ఆదుకోవాలని కర్నూలుకు చెందిన ప్రముఖ శిల్ప కళాకారుడు బోయ శ్రీనివాసులు మంత్రి టీజీ భరత్‌కు విన్నవించారు. సోమవారం టీజీ భరత్ జన్మ దినం సందర్భంగా శిల్పి బోయ శ్రీనివాసులు మంత్రి నివాసంలో కలిసి పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మంత్రికి శిల్పకారుల సమస్యలు విన్నవించారు. భవన కార్మికులకు ప్రత్యేక గుర్తింపు, 60 ఏళ్లు దాటిన వారికి పింఛన్లు, ఉచిత వైద్యం అందించాలని కోరారు. శిల్ప కళలకు తోడ్పడే కార్మికులకు, దినసరి కూలీలకు ప్రభుత్వం ఆర్టీసీ బస్సు చార్జీల్లో రాయి తీలు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. శిల్ప కళాకారులకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ద్వారా ప్రత్యేక గుర్తింపు కార్డులు జారీ చేయాలని కోరారు. మంత్రి టీజీ భరత్ స్పందిస్తూ శిల్ప కళాకారులను ఆదుకుంటామన్నారు.

● నగర శివారులోని గాయత్రి గోసంరక్షణ శాలలో టీజీవీ కళాక్షేత్రం అధ్యక్షుడు పత్తి ఓబులయ్య, కళాకారులు గాండ్ల లక్ష్మన్న, సీవీ రెడ్డి, సంగా ఆంజనేయులు, సోమశేఖర్, కేవీ రమణ టీజీ భరత్‌కు పుష్పగుచ్ఛాలు అందజేసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. నగరంలోని సీతారాముల కల్యాణోత్సవ సమితి పక్షాన ఆ సంస్థ ప్రతినిధులు రూ. 10 వేలు చెక్కును శ్రీ గాయత్రి గోసంరక్షణ శాలకు విరాళంగా అందజేశారు. కార్యక్రమంలో సమితి ప్రతినిధులు డాక్టర్ మోక్షేశ్వరుడు, నాగోజీరావు, చల్లా దామోదర్‌రెడ్డి, మహబలేష్, గోపీనాథ్, రమేష్, మల్లికార్జున పాల్గొన్నారు. టీజీ భరత్ జన్మదిన సందర్భంగా లయన్స్ క్లబ్ సభ్యులు డాక్టర్ రాయపాటి శ్రీనివాస్, పవన్, ఎన్ వెంకటరామరాజు, రత్నప్రసాద్, డాక్టర్ జయప్రకాశ్, సీడీజీ గిరిలు టీజీ భరత్‌కు పుష్పగుచ్ఛాలు అందజేశారు. నగరంలోని బ్రాహ్మణ సేవా సంక్షేమ మిత్రమండలి ఆధ్వర్యంలో బ్రాహ్మణ సంఘాల నాయకులు టీజీ భరత్‌కు వేద ఆశీర్వాదం అందజేశారు. సందేల్ చంద్రశేఖర్ టీజీ భరత్‌కు శాలువ కప్పి ఆశీర్వదించగా, అర్చక పురోహిత సంఘం అధ్యక్షుడు టీవీ రవిచంద్ర శర్మ తిరుమల శ్రీవారి లడ్డుప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో కరణం హరిశర్మ, పరమేశ్ శర్మ, అనూజ్ కుమార్ శర్మ పాల్గొన్నారు.

కర్నూలు(న్యూసిటీ): మంత్రి టీజీ భరత్ జన్మదినాన్ని పురస్కరించుకుని నగర పాలక సంస్థ కమిషనర్ పీవీ రామలింగేశ్వర్ శుభాకాంక్షలు తెలిపారు. కమిషనర్‌తోపాటు మెడికల్ హెల్త్ ఆఫీసర్ కే.విశ్వేశ్వరరెడ్డి, ఎంఈలు షాకీర్ హుస్సేన్, శేషసాయి, డీసీపీ సంధ్యారాణి, ఆర్ఓ జునైద్, మేనేజర్ చిన్న రాముడు, సెక్రటరీ నాగరాజు, డీఈఈలు, ఏఈఈలు మంత్రికి శుభాకాంక్షలు తెలిపారు.

● బిర్లాగేట్ సమీపంలోని రోడ్డుసైడ్ వ్యాపారులు మంత్రి టీజీ భరత్ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. శ్రీనివాసులు ఆధ్వర్యంలో కేక్‌కట్ చేసి మిఠాయిలు పంచిపెట్టారు.

● మంత్రి టీజీ భరత్ జన్మదినాన్ని పురస్కరించుకుని జీసస్ సోల్జర్ మినిస్ట్రీస్ సంఘం అధ్యక్షుడు జి.రవికుమార్ నగర ప్రజలకు పూలమొక్కలను పంపిణీ చేశారు. కొండారెడ్డిబురుజు సమీపంలో ఏర్పాటు చేసిన పంపిణీ కార్యక్రమంలో రవికుమార్ మాట్లాడారు. కార్యక్రమంలో సెక్రటరీ, ఆర్.ప్రసాదరావు, సభ్యులు పుష్పరాజు, జాకబ్, ఎస్.వెంకటేష్ పాల్గొన్నారు.





భరత్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న శిల్పి శ్రీనివాసులు, దివ్యాంగులకు పండ్ల పంపిణీ, శుభాకాంక్షలు తెలియజేస్తున్న టీడీపీ కార్యనిర్వాహక కార్యదర్శి వహిద్ హుసేన్, 44వ వార్డులో భారీ కేక్‌ను కట్ చేస్తున్న భరత్

తహసీల్దార్‌ను కలిసిన టీడీపీ నాయకులు


తహసీల్దార్‌కు పుష్పగుచ్ఛం ఇస్తున్న టీడీపీ నాయకులు

ఓర్వకల్లు, ఆగస్టు 5: ఓర్వకల్లు నూతన తహసీల్దార్ వెంకట రమణను సోమవారం కార్యాలయంలో టీడీపీ మండల కన్వీనర్ గోవిందరెడ్డి, నాయకులు లక్ష్మీకాంతరెడ్డి, రాంభూపాల్ రెడ్డిలు మర్యాదపూర్వకంగా కలిసి శాలువ, పూలమాలతో సన్మానించారు. వారు మాట్లాడుతూ తహసీల్దార్ వెంకటరమణ పేదల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలన్నారు.

● **ఫిర్యాదులను పరిష్కరించండి:** ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదులను తక్షణమే పరిష్కరించాలని తహసీల్దార్ వెంకటరమణ కోరారు. సోమవారం తహసీల్దార్ కార్యాలయంలో ఆయన ప్రజల నుంచి వచ్చిన వినతులను స్వీకరించారు. కార్యక్రమంలో ఆయా శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే గౌరు చరితను కలిసిన డీఎస్పీ

కల్లూరు, ఆగస్టు 5: పాణ్యం ఎమ్మెల్యే గౌరుచరితను కర్నూలు డీఎస్పీ బాబుప్రసాద్ మర్యాదపూర్వకంగా కలిశారు. సోమవారం మాధవీనగర్‌లోని ఎమ్మెల్యే నివాసంలో ఆమెను కలిసి పూలబోకే అందజేశారు.

గాయపడిన విద్యార్థిని మృతి

కోడుమూరు(రూరల్), ఆగస్టు 5: మండలంలోని కొత్తూరు సమీపంలో గత శనివారం రెండు బైక్‌లు ఢీకొన్న ఘటనలో తీవ్రంగా గాయపడిన నర్సింగ్ విద్యార్థిని కోలుకోలేక మృతి చెందింది. బీఎస్సీ నర్సింగ్ చదువుతున్న సుహాసిని (21) తెలిసిన వ్యక్తి బైక్‌పై కోడుమూరు వైపు వస్తున్నారు. అయితే కొత్తూరు సమీపంలో వీరు ప్రయాణిస్తున్న బైక్ మరో బైక్ ప్రమాదవశాత్తు ఢీకొన్నాయి. దీంతో సుహాసిని తలకు తీవ్ర గాయాలయ్యాయి. బైక్‌లపై వెళ్తున్న ఇద్దరు వ్యక్తులకు గాయాలయ్యాయి. గాయపడిన క్షతగాత్రులను ఆసుపత్రికి తరలించారు. అయితే చికిత్స పొందుతున్న సుహాసిని సోమవారం మృతి చెందింది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ బాలనరసింహులు తెలిపారు.

ఉమ్మడి కర్నూలు జిల్లా బజరంగ్‌దళ్ కన్వీనర్‌గా రాజేష్

గూడూరు ఆగస్టు 5: విశ్వహిందూ పరిషత్‌లో యువ విభాగం బజరంగ్‌దళ్ ఉమ్మడి కర్నూలు జిల్లా కన్వీనర్‌గా మీనుగ రాజేష్‌ను వీహెచ్‌పీ రాష్ట్ర అధ్యక్షుడు సాయిరెడ్డి, రాష్ట్ర కార్యదర్శి కాకర్ల రాముడు నియమించారు. శని, ఆదివారాల్లో తిరుపతిలోని వరదయ్యపాలెంలో జరిగిన విశ్వహిందూ పరిషత్ రాష్ట్ర కార్యవర్గ సమావేశాలలో ప్రకటించారు. ఈసందర్భంగా రాజేష్ మాట్లాడుతూ వీహెచ్‌పీ ఆశయాలు, సేవా కార్యక్రమాలను విస్తృతం చేసేందుకు కృషి చేస్తానన్నారు.

రోడ్డు నిర్మాణ పనులు చేపట్టండి: సీపీఎం

ఓర్వకల్లు, ఆగస్టు 5: కేతవరం నుంచి గార్గేయపురం రోడ్డు నిర్మాణ పనులు చేపట్టాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు రామకృష్ణ కోరారు. సోమవారం కలెక్టర్ కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదికలో డిప్యూటీ కలెక్టర్ శివనాగలక్ష్మికి వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు నాగన్న, సూర్యనారాయణ, రంగస్వామి, వెంకటస్వామి, గఫార్‌మియా పాల్గొన్నారు.

ఒలింపిక్ క్రీడాకారులకు మంత్రి శుభాకాంక్షలు

కర్నూలు(స్పోర్ట్స్), ఆగస్టు 5: పారిస్‌లో 2024 ఒలింపిక్స్‌లో దేశ, రాష్ట్ర క్రీడాకారులు మరెన్నో పతకాలు సాధించాలని రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్ విక్టరీ సెల్ఫీ స్టాండ్‌లో శుభాకాంక్షలు తెలిపారు. జూలై 26 నుంచి ఆగస్టు 11వ తేదీ వరకు పారిస్‌లో జరుగుతున్న ఒలింపిక్ క్రీడల్లో పాల్గొన్న 117 మంది భారత క్రీడాకారులకు శుభాకాంక్షలు తెలిపారు. మనుబాకర్, స్వప్నిల్ కుసెల్ 40 మీటర్ల రైఫిల్ షూటింగ్‌లో కాంస్య పతకం సాధించినందుకు అభినందనలు తెలిపారు. అదేవిధంగా మంత్రి టీజీ భరత్‌కు క్రీడా ప్రాధికార సంస్థ అధికారి భూపతిరావు, క్రీడా సంఘాల ప్రతినిధులు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

దేశాన్ని అస్థిరపరిచే చర్యలను ఐక్యతతో తిప్పి కొట్టాలి

రాజకీయ విశ్లేషకులు సుధాకర్


సదస్సులో ప్రసంగిస్తున్న రాకా సుధాకర్

కర్నూలు(కల్చరల్), ఆగస్టు 5: దేశాన్ని అస్థిరపరిచే చర్యలను హిందువులంతా ఐక్యతతో తిప్పి కొట్టాలని, మణిపూర్‌లో జరిగిన హింసాత్మక సంఘటనలు కూడా అలాంటివేనని ప్రముఖ రాజకీయ విశ్లేషకులు, రాకాలోకం చీఫ్ ఎడిటర్ రాకా సుధాకర్ అన్నారు. సోమవారం రాత్రి నగరంలోని వెంకటరమణ కాలనీలోగల శ్రీ లక్ష్మీవేంకటేశ్వర స్వామి కల్యాణ మంటపంలో కర్నూలు సమాలోచన (మేధావుల వేదిక) సంస్థ ఆధ్వర్యంలో అవగాహన సదస్సు జరిగింది. దేశంలోని వివిధ రాష్ట్రాలో సెక్యులర్ ముసుగులో జరుగుతున్న హిందూ వ్యతిరేక కార్యకలాపాలపై సుధాకర్ ప్రస్తావించారు. మణిపూర్ సంఘటన రెండు గిరిజన తెగలకు సంబంధించిన అంశమని, దాన్ని ఆయా తెగల పెద్దల ద్వారానే సమావేశాలు జరిపి పరిష్కరించాల్సిన అంశాలని అన్నారు. ఎక్కడో మణిపూర్‌లో సంఘటన జరిగితే అమెరికా లాంటి దేశంలోని పత్రికల్లో వస్తాయని, దేశంలో అస్థిర పరిస్థితులను నెలకొల్పేందుకు అమెరికా లాంటి దేశాలు యత్నిస్తున్నాయని చెప్పారు. భారత ప్రధాని కూడా మణిపూర్ ఘటన అంశంలో ఆలోచించి, సమస్యను పూర్తిస్థాయిగా రూపుమాపే ప్రయత్నం చేస్తున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో సంయుఓజిక్ ఎస్‌వీకే మల్లికార్జున రావు, వీఆర్ హాస్పిటల్ అధినేత డాక్టర్ వాసురెడ్డి, విశ్రాంత ఇంజనీర్ రఘురామయ్య తదితరులు పాల్గొన్నారు.

రెడ్‌బుక్ తెరవకముందే వైసీపీలో అలజడి

కర్నూలు(అర్బన్), ఆగస్టు 5: రెడ్‌బుక్ తెరవక ముందే వైసీపీలో ఆందోళన మొదలైందని మాజీ మంత్రి కేఈ ప్రభాకర్ అన్నారు. సోమవారం నగరంలోని అసాంఘిక కార్యకలాపాలపై 48వ వార్డు రోజావీధిలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ మహిళా ఐక్యవేదిక నగర అధ్యక్షురాలు మీసాల సుమలత ఆధ్వర్యంలో అవగాహన సదస్సు జరిగింది. ముఖ్య అతిథిగా పాల్గొని ఆయన మాట్లాడుతూ ఎర్రచందనం స్మగ్లర్లు, గంజాయి బ్లేడు బ్యాచ్‌లు ఏపీలో టీడీపీ ప్రజా ప్రభుత్వ పాలనలో ఉండకుండా ఏరిపారివేస్తామని చెప్పారు. కార్యక్రమంలో జడ్పీటీసీ జ్ఞానేశ్వర్‌గౌడు, నాగన్న, ఆంజనేయులు, రాముడు, షంషర్ ఖాదర్, శాలిమియా, శేషమ్మ, కరెమ్మ, నారాయణమ్మ పాల్గొన్నారు.

విద్యార్థులు మొక్కలు పెంచాలి

కర్నూలు(హాస్పిటల్), ఆగస్టు 5: ప్రతి విద్యార్థి ఒక మొక్కను పెంచి, దాని సంరక్షణ బాధ్యతను తీసుకోవాలని కర్నూలు మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ డా.కే.చిట్టి నరసమ్మ అన్నారు. సోమవారం కర్నూలు మెడికల్ కాలేజీ ఆవరణలోని రాజ్‌విహార్ యుజీ హాస్టల్‌లో తల్లికి వందనం కింద మాతోంకే నాంపే ఏక్ పెడ్ కార్యక్రమంలో భాగంగా ప్రిన్సిపాల్ విద్యార్థులతో కలిసి మొక్కలను నాటారు. వైస్ ప్రిన్సిపాల్ డా.పద్మా విజయశ్రీ, యుజీమెన్స్ హాస్టల్ చీఫ్‌వార్డెన్ ఎస్.నాగేశ్వరరావు, డిప్యూటీ వార్డెన్ సోమశేఖర్ పాల్గొన్నారు.

పెండింగ్ బకాయిలు చెల్లించాలి

కర్నూలు(న్యూసిటీ), ఆగస్టు 5: జిల్లాలో ఉపాధి హామీలో పని చేసిన కూలీల డబ్బులు చాలా రోజులుగా పెండింగ్‌లో ఉన్నాయని, వాటిని తక్షణమే చెల్లించే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆవుల శేఖర్ కోరారు. సోమవారం సంఘం ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు.

జీవో 77ని రద్దు చేయాలి

కర్నూలు(ఎడ్యుకేషన్), ఆగస్టు 5: జీవో నెంబర్ 77ని రద్దు చేయాలని అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ (ఏబీవీపీ) నగర శాఖ డిమాండ్ చేసింది. సోమవారం ఏబీవీపీ ఆధ్వర్యంలో స్థానిక గాయత్రీ ఎస్టేట్ నుంచి కలెక్టరేట్ వరకు ర్యాలీ నిర్వహించి నిరసన తెలియజేశారు. ఆర్‌యూ అధ్యక్ష, కార్యదర్శులు కార్తీక్ నాయక్, రాజు, మహ్మద్, విద్యార్థులు పాల్గొన్నారు.

తహసీల్దార్‌గా బాధ్యతల స్వీకరణ

గూడూరు ఆగస్టు 5: గూడూరు మండల నూతన తహసీల్దార్‌గా కె.రామాంజనేయులు బాధ్యతలు స్వీకరించారు. సోమవారం గూడూరు తహసీల్దార్ కార్యాలయంలో ఆయన బాధ్యతలు స్వీకరించగా రెవెన్యూ అధికారులు అభినందించారు. ఈసందర్భంగా నూతన తహసీల్దార్ కె రామాంజనేయులు మాట్లాడుతూ ప్రజలకు అందుబాటులో ఉండి వారి సమస్యలను పరిష్కరిస్తామన్నారు.

డీఎంఈని కలిసిన రాష్ట్ర ఫోరెన్సిక్ అసోసియేషన్

కర్నూలు(హాస్పిటల్), ఆగస్టు 5: రాష్ట్రంలో ఉన్న ప్రభుత్వ బోధనాసుపత్రుల్లో పని చేస్తున్న ఫోరెన్సిక్ వైద్యులకు పోస్టుమార్టం అలవెన్సులను విడుదల చేయాలని ఏపీ అకడమి ఆఫ్ ఫోరెన్సిక్ మెడిసిన్ అండ్ టాక్సికాలజీ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ టి.సాయి సుధీర్ డీఎంఈకి వినతి పత్రం అందజేశారు. సోమవారం విజయవాడలోని డీఎంఈ డా.నరసింహన్‌ను కలిసి ఆయన సమస్యలను వివరించారు.

అర్జీలను త్వరగా పరిష్కరించాలి: కమిషనర్

కర్నూలు(న్యూసిటీ), ఆగస్టు 5: ప్రజల నుంచి వచ్చే అర్జీలను త్వరగా పరిష్కరించాలని సంబంధిత అధికారులను నగర పాలక సంస్థ కమిషనర్ పీవీ రామలింగేశ్వర్ ఆదేశించారు. సోమవారం నగర పాలక సంస్థ కార్యాలయంలో నిర్వహించిన ప్రజల సమస్యల పరిష్కార వేదికలో ప్రజల నుంచి 11 అర్జీలను స్వీకరించారు. కార్యక్రమంలో ఎస్ఈ డి.వేణుగోపాల్, మెడికల్ హెల్త్ ఆఫీసర్ కే.విశ్వేశ్వర రెడ్డి, డీసీపి సంధ్య, ఆర్ఓ జునైద్, మేనేజర్ చిన్నరాముడు, టిడ్కో అధికారి పెంచలయ్య పాల్గొన్నారు.

నేడు కోర్టు విధుల బహిష్కరణ

కర్నూలు(లీగల్), ఆగస్టు 5: ఆళ్లగడ్డ, అలంపూరులలో సివిల్ కేసుల్లో పోలీసులు జోక్యం చేసుకుని న్యాయవాదులపై దాడి చేసినందుకు నిరసనగా మంగళవారం స్థానిక న్యాయవాదులు కోర్టు విధులను బహిష్కరిస్తున్నట్లు బార్ అసోసియేషన్ తీర్మానం ఆమోదించింది. సోమవారం బార్ అసోసియేషన్ కార్యాలయంలో అధ్యక్షుడు బి.కృష్ణమూర్తి, ప్రధాన కార్యదర్శి రవికాంత్ ప్రసాద్ మాట్లాడుతూ ఆళ్లగడ్డ బార్ అసోసియేషన్‌కు చెందిన సీనియర్ న్యాయవాది పి.సుబ్బరామిరెడ్డి, అలంపూరు న్యాయవాది గొల్ల శశిధర్‌లపై ఆయా పట్టణ పోలీసు అధికారులు సివిల్ కేసుల్లో జోక్యం చేసుకుని న్యాయవాదులపై దాడి చేశారని ఆరోపించారు.

పంట నమోదు పరిశీలన

కోడుమూరు, ఆగస్టు 5: పంట నమోదు కార్యక్రమాన్ని తహసీల్దార్ వెంకటేశ్‌నాయక్, మండల వ్యవసాయ అధికారి రవిప్రకాష్ పరిశీలించారు. పట్టణ పరిధిలోని రైతు సేవా కేంద్రం సిబ్బంది నిర్వహిస్తున్న పంట నమోదు కార్యక్రమాన్ని సోమవారం పరిశీలించారు. కార్యక్రమంలో వీఆర్వోలు నారాయణ, ఎల్లప్ప పాల్గొన్నారు.

వీఆర్వోలు బాధ్యతగా పనిచేయాలి: తహసీల్దార్

సి.బెళగల్, ఆగస్టు 5: వీఆర్వోలు బాధ్యతగా పనిచేయాలని తహసీల్దార్ విజయశ్రీ అన్నారు. సోమవారం సి. బెళగల్ తహసీల్దార్‌గా విజయశ్రీ బాధ్యతలు తీసుకున్న అనంతరం మండలంలోని 10 రెవిన్యూ గ్రామాల వీఆర్వోలతో సమావేశం నిర్వహించి పరిచయం చేసుకున్నారు. అలాగే మండలంలోని వివరాలను 10 రెవిన్యూ గ్రామాల వారిగా వీఆర్వోలను అడిగి తెలుసుకున్నారు. మండలంలో ఎంత పొలం ఉన్నది సాగు ఎంత ఉన్నది వాటి వివరాలను తెలుసుకున్నారు.

తహసీల్దార్‌ను కలిసిన టీడీపీ నాయకులు: సి.బెళగల్ తహసీల్దార్‌గా సోమవారం బాధ్యతలు చేపట్టిన తహసీల్దార్ విజయశ్రీని సోమవారం జిల్లా టీడీపీ ముస్లిం మైనార్టీ నాయకులు ఆమెను మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. మండలంలో అధికంగా భూ సమస్యలు ఉన్నాయి వాటిని పరిష్కరించాలని ఆమెను కోరారు.

మంత్రి భరత్‌కు బార్ అసోసియేషన్ శుభాకాంక్షలు

కర్నూలు(లీగల్), ఆగస్టు 5: మంత్రి టీజీ భరత్‌కు బార్ అసోసియేషన్ న్యాయవాదులు సోమవారం గుత్తి రోడ్డులోని గోశాలలో కలిసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర బార్ కౌన్సిల్ సభ్యులు పాలూరి రవిగువేరా, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు బి.కృష్ణమూర్తి, ప్రధాన కార్యదర్శి బీఎస్ రవికాంత్ ప్రసాద్, సీనియర్ న్యాయవాదులు మురళీ మోహన్, ఏ.మాదన్న, పి.దస్తగిరి, మహిళా ప్రతినిధి సుమనా రాణి, న్యాయవాది షాబుద్దీన్ పాల్గొన్నారు.

ప్రజా సమస్యలను త్వరితగతిన పరిష్కరించండి

● ఆదోని సబ్ కలెక్టర్ శివ నారాయణ్ శర్మ

ఆదోని, ఆగస్టు 5: ప్రజా సమస్యలను వేగవంతంగా పరిష్కరించాలని ఆదోని సబ్ కలెక్టర్ శివ నారాయణ్ శర్మ పేర్కొన్నారు. సోమవారం ఆదోని సబ్ కలెక్టర్ కార్యాలయంలో పబ్లిక్ గ్రీవెన్స్ రిడ్రసెల్ సిస్టం-పీజీఆర్ఎస్ కార్యక్రమం జరిగింది. ఆయా మండలాల ప్రజల నుంచి వచ్చిన అర్జీలను స్వీకరించారు. సబ్ కలెక్టర్ మాట్లాడుతూ వచ్చిన అర్జీలను ఏ ఒక్క అధికారి నిర్లక్ష్యం చేయకుండా ఎప్పటికప్పుడు పరిష్కరించాలని అధికారులకు సూచించారు.

● పెద్దహరివాణం గ్రామంలో చెరువులో ఫిల్టర్లు సరిగ్గా పనిచేయడం లేదు. ఫిల్టర్లను మరమ్మతులను చేయించి తాగు నీరు అందించాలని గ్రామ ప్రజలు అర్జీ అందజేశారు.

● కౌతాళం మండలం ఇరిగేరి ఎరిగేరి గ్రామానికి చెందిన భీమేష్‌కి సంబంధించి సర్వేనెంబర్ 503/ఏ3డీలో 2.75 ఎకరాల భూమి ఉండగా ప్రస్తుతం సదరు భూమి ఆన్లైన్‌లో 0.23 సెంట్లు చూపిస్తుందని అర్జీ సమర్పించుకున్నారు.


అర్జీలను స్వీకరిస్తున్న సబ్‌కలెక్టర్

● ఆదోని మండలం గనేకల్ గ్రామానికి చెందిన సూరప్ప సంబంధించి సర్వేనెంబర్ 17జీలో 2.14 ఎకరాల భూమి, సర్వే నెంబర్ 70.జీలో 2.28 ఎకరాల భూమి ఉండగా ప్రస్తుతం ఈ భూమి ఆన్‌లైన్‌లో వేరే వారి పేరు నమోదైందని, వేరే వ్యక్తి పేరు తొలగించి, తన పేరు నమోదు చేయాలని ఫిర్యాదు చేశారు.

ఉపాధ్యాయులపై యాప్‌ల భారం తగ్గించాలి

ఆదోని (అగ్రికల్చర్), ఆగస్టు 5: ప్రభుత్వ పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయులకు యాప్‌ల భారాన్ని తగ్గించాలని ఏపీటీఎఫ్ రాష్ట్ర కౌన్సిలర్ సంగమేష్ కోరారు. సోమవారం ఏపీటీఎఫ్ ప్రాంతీయ కార్యాలయంలో కౌతాళం మండల అధ్యక్షుడు అనుమంత్ రెడ్డి అధ్యక్షతన డివిజన్ స్థాయి సమావేశం జరిగింది. ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వం ఉపాధ్యాయులపై బోధనేతర పనులు అప్పజెప్పడం వల్ల ఇబ్బందులకు గురయ్యారన్నారు. అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం ఉపాధ్యాయులను యాప్‌ల భారాన్ని తగ్గించి బోధనకే పరిమితం చేయాలన్నారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు నాగరాజు, మండల ప్రధాన కార్యదర్శి మల్లికార్జున, పూర్వ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రఘురామయ్య, సుదర్శన్ రెడ్డి, గోపీనాయక్, బీరప్ప, మాలిక్, భాషా, బీమ్ రెడ్డి, భాస్కర్ రాఘవేంద్ర నరసింహా రెడ్డి పాల్గొన్నారు.

ప్రజా సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలి

తుగ్గలి, ఆగస్టు 5: రైతుల భూసమస్యలను, ప్రజా సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని టీడీపీ యువ నాయకుడు రాజేంద్రగౌడు కోరారు. సోమవారం తుగ్గలి తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ నాగరాజును కలిసి రైతు సమస్యలను తెలిపారు. అనంతరం తహసీల్దార్‌ను సన్మానించారు. కార్యక్రమంలో వీఆర్వో కృష్ణారెడ్డి, నాయకులు కోటేశ్‌గౌడు, రామాంజనేయులు గౌడు తదితరులు ఉన్నారు.


తహసీల్దార్‌ను సన్మానిస్తున్న టీడీపీ నాయకులు

సుప్రీం కోర్టు తీర్పు హర్షణీయం

పత్తికొండ టౌన్, ఆగస్టు 5: ఎస్సీ వర్గీకరణను సమర్థించి అత్యున్నత ధర్మాసనం సుప్రీం కోర్టు తీర్పు ఇవ్వడం హర్షణీయమని ఎమ్మార్పీఎస్ఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంటు బొందిమడుగుల రమేష్ అన్నారు. సోమవారం ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో పట్టణంలోని డా.బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ఎస్ నాయకులు జిల్లా అధ్యక్షులు గిడ్డయ్య మాదిగ, కార్యదర్శి మద్దిలేటి మాదిగ, పత్తికొండ డివిజన్ కన్వీనర్ రామాంజనేయులు, నాయకుడు రంగన్న, ఎల్లప్ప పాల్గొన్నారు.


అంబేడ్కర్‌కు క్షీరాభిషేకం చేస్తున్న నాయకులు

ప్రజలకు సేవలు అందించాలి

మద్దికెర, ఆగస్టు 5: మండలంలోని ప్రజలందరికీ పార్టీలకతీతంగా సేవలు అందించాలని మాజీ జడ్పీటీసీ సభ్యులు జమేదార్ రాజన్న యాదవ్, తాలుకా తెలుగు యువత అధ్యక్షులు ఈడిగ చంద్రశేఖర్ గౌడు, జిల్లా టీడీపీ కార్యవర్గ సభ్యులు ఎన్.లక్ష్మినారాయణ అన్నారు. సోమవారం మద్దికెర తహసీల్దార్ హుశేన్‌సాహేబ్‌ను టీడీపీ నాయకులు సన్మానించారు. వారు మాట్లాడుతూ మండలంలో రెవెన్యూ సమస్యలు ఏవైనా ఉన్నా పరిష్కరించాలన్నారు. మండలంలోని ఎం.అగ్రహారం గ్రామంలో ఇంటి పట్టాల సమస్య ఉందని పరిష్కరించాలని కోరారు. తహసీల్దార్ మాట్లాడుతూ రికార్డుపరంగా ఉన్న అన్ని సమస్యలు పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.

వ్యక్తి అనుమానాస్పద మృతి

ఆస్పరి, ఆగస్ట్ 5: ఆస్పరికి చెందిన కావలి చిన్న నరసన్న (52) అనుమానాస్పద స్థితిలో మృతి చెందినట్లు సోమవారం సీఐ హనుమంతప్ప తెలిపారు. రెండు రోజులు క్రితం చిన్న నరసన్న ఇంటి నుండి బయటికి వెళ్లి తిరిగి రాకపోవడంతో కుటుంబ సభ్యులు చాలా చోట్ల వెతికారు. జొహరాపురం రోడ్డు నల్ల వాగు కుడివైపు పొలంలో అనుమానాస్పద స్థితిలో మృతి చెంది ఉన్న చిన్న నరసన్నను గుర్తుపడి పోలీసులకు సమాచారం ఇచ్చారు. బంధువులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ హనుమంతప్ప తెలిపారు.

వెల్దుర్తి సీఐగా మధుసూదనరావు

వెల్దుర్తి, ఆగస్టు, 5: వెల్దుర్తి సీఐగా బి.మధుసూదనరావు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఎమ్మిగనూరు టౌన్ నుంచి వెల్దుర్తి సీఐగా బదిలీ అయ్యారు. వెల్దుర్తి, క్రిష్ణగిరి మండలాల్లో శాంతి భద్రతల పరిరక్షణకు పాటుపడతానని తెలిపారు. ఇక్కడ విధులు నిర్వహిస్తున్న బి.వి. మధుసూదనరావు వీఆర్‌కు వెళ్లారు.


సీఐ మధుసూదనరావుకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న పోలీసులు

దేశాన్ని అస్థిరపరిచే చర్యలను
ఐక్యతతో తిప్పి కొట్టాలి

మేధావుల వేదికలో రాజకీయ విశ్లేషకులు సుధాకర్

కర్నూలు(కల్చరల్), ఆగస్టు 5: దేశాన్ని అస్థిరపరిచే చర్యలను హిందువులంతా ఐక్యతతో తిప్పి కొట్టాలని, మణిపూర్‌లో జరిగిన హింసాత్మక సంఘటనలు కూడా అలాంటివేనని ప్రముఖ రాజకీయ విశ్లేషకులు, రాకాలోకం చీఫ్ ఎడిటర్ రాకా సుధాకర్ అన్నారు. సోమవారం రాత్రి నగరంలోని వెంకటరమణ కాలనీలోగల శ్రీ లక్ష్మీవేంకటేశ్వర స్వామి కల్యాణ మంటపంలో కర్నూలు సమాలోచన (మేధావుల వేదిక) సంస్థ ఆధ్వర్యంలో అవగాహన సదస్సు జరిగింది. దేశంలోని వివిధ రాష్ట్రాలో సెక్యులర్ ముసుగులో జరుగుతున్న హిందూ వ్యతిరేక కార్యకలాపాలపై సుధాకర్ ప్రస్తావించారు. మణిపూర్ సంఘటన రెండు గిరిజన తెగలకు సంబంధించిన అంశమని, దాన్ని ఆయా తెగల పెద్దల ద్వారానే సమావేశాలు జరిపి పరిష్కరించాల్సిన అంశాలని అన్నారు. ఎక్కడో మణిపూర్‌లో సంఘటన జరిగితే అమెరికా లాంటి దేశంలోని పత్రికల్లో వస్తాయని, దేశంలో అస్థిర పరిస్థితులను నెలకొల్పేందుకు అమెరికా లాంటి దేశాలు యత్నిస్తున్నాయని చెప్పారు. భారత ప్రధాని కూడా మణిపూర్ ఘటన అంశంలో ఆలోచించి, సమస్యను పూర్తిస్థాయిగా రూపుమాపే ప్రయత్నం చేస్తున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో సంయుక్తజిక్ ఎస్వీకే మల్లికార్జున రావు, వీఆర్ హాస్పిటల్ అధినేత డాక్టర్ వాసురెడ్డి, విశ్రాంత ఇంజినీర్ రఘురామయ్య పాల్గొన్నారు.


మాట్లాడుతున్న రాకా సుధాకర్

వేపనూనెతో రసం పీల్చే పురుగుల నివారణ

పెద్దకడబూరు ఆగస్టు 5: మిరపలో వడ తెగుల నివారణకు, రసం పీల్చే పురుగులకు వేపనూనేను పిచికారి చేయాలని బనవాసి కృషి విజ్ఞాన శాస్త్రవేత్తలు రాఘవేంద్ర, మౌనిక, చందన, వ్యవసాయ సహాయకులు శ్వేత అన్నారు. సోమవారం పెద్దకడబూరులోని పత్తి, మిరప,వరి పంటలను వ్యవసాయ అధికారి వరప్రసాద్ ఆధ్వర్యంలో పొలాలను క్షేత్ర సందర్శన చేశారు. కార్యక్రమంలో వ్యవసాయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.


మిరప పంటలను పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు

జీవో నెంబర్ 77 రద్దు చేయాలి

ఆదోని (అగ్రికల్చర్), ఆగస్ట్ 5: గత ప్రభుత్వం ఉన్నత విద్య అందకుండా చేసేందుకు జారీ చేసిన జీవో నెంబర్ 77ను వెంటనే రద్దు చేయాలని ఏబీవీపీ పట్టణ కార్యదర్శి వీరేష్ కోరారు. సోమవారం సబ్ కలెక్టర్ శివ నారాయణ శర్మను ఏబీవీపీ కార్యకర్తలు కలిసి వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు ఉమా మహేష్, గోవింద్ రాజ్, రంగనాథ్ పాల్గొన్నారు.


సబ్ కలెక్టర్ శివ నారాయణ శర్మకు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

వక్ఫ్ బోర్డు సవరణ బిల్లును వ్యతిరేకిస్తాం

ఆదోని టౌన్, ఆగస్టు 5: కేంద్ర ప్రభుత్వం మైనారిటీలకు సంబంధించిన వక్ఫ్ బోర్డ్ సవరణ బిల్లును పార్లమెంటులో ప్రవేశపెట్టిడాన్ని తాము తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని కాంగ్రెస్ పార్టీ మైనార్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు ఎండి నూర్ అహ్మద్ అన్నారు. సోమవారం ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం వక్ఫ్ భూములను తన గుప్పెట్లో పెట్టుకోవడానికి ప్రయత్నాలు జరుగుతున్నాయని, ఈ బిల్లును ఆమోదించడానికి పార్లమెంటులో తెలుగు దేశం పార్టీతో పాటు వైఎస్ఆర్సీపీ పార్టీ కూడా మద్దతు ఇవ్వడం ఎంతో విచారకరమని అన్నారు. సవరణ బిల్లును ఆమోదించకుండా మైనార్టీలతో కలిసి ఆందోళన కార్యక్రమాలను నిర్వహిస్తామని హెచ్చరించారు.

పాఠశాలపై చర్యలు తీసుకోవాలి

గోనెగండ్ల, ఆగస్టు 5: అర్హత లేని ఉపాధ్యాయులతో విద్యార్థులకు విద్యాబోధన చేయిస్తున్న జీనియస్ గ్లోబల్ స్కూల్, వికాస్ స్కూల్ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని రాయలసీమ విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షుడు నాగరాజు డిమాండ్ చేశారు. సోమవారం గోనెగండ్ల ఎంఈవో కార్యాలయం నిరసన తెలిపారు. అనంతరం ఎంఈవో2 నీలకంఠకు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో సంఘం నాయకులు పూర్ణ, అశోక్, రాజారావు పాల్గొన్నారు.

బాధ్యతలు చేపట్టిన తహసీల్దార్లు

గోనెగండ్ల, ఆగస్టు 5: గోనెగండ్ల మండల నూతన తహసీల్దార్ గా కే. కమారస్వామి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన అన్నమయ్య జిల్లా రాయచోటి నియోజకవర్గంలోని లక్కిరెడ్డిపల్లి మండలం నుంచి గోనెగండ్లకు బదిలీ అయ్యారు. అంతకు ముందు కర్నూలు జిల్లాలోని ఆస్పరి మండలం తహసీల్దార్‌గా పనిచేశారు.

హాలహర్వి: హాలహర్వి మండలంలో భూసమస్యలు పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ నజీమబాను అన్నారు. సోమవారం నూతన తహసీల్దార్‌గా బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా గ్రామ స్థాయిలో త్వరలో కౌలు రైతులకు గుర్తింపు కార్డులు అందజేస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ లక్ష్మీ ఉన్నారు.

పెద్దకడబూరు: పెద్దకడబూరు తహసీల్దార్‌గా శ్రీనాథ్ బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పనిచేస్తున్న తహసీల్దార్ సురేష్ బాబు సోంత జిల్లాకు బదిలీపై వెళ్లారు. తహసీల్దార్ మాట్లాడుతూ రైతుల భూ సమస్యలు ఏవైనా ఉంటే తమ దృష్టికి తీసుకోస్తే పరిష్కరిస్తామని అన్నారు.

కౌతాళం: కౌతాళం తహసీల్దార్‌గా జే.మల్లికార్జున స్వామి సోమవారం పదవి బాధ్యతలు స్వీకరించారు. అంతకు ముందు మండలంలో ప్రముఖ దేవాలయం అయిన ఉరుకుంద ఈరన్న స్వామిని దర్శించుకుని ఆశీర్వాదం తీసుకున్నారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయానికి చేరుకుని బాధ్యతలు స్వీకరించారు. ఆర్ఐ రాజశేఖర్‌గౌడ్, వీఆర్ఓలు సత్కరించారు.

క్రిష్ణగిరి: క్రిష్ణగిరి తహసీల్దార్‌గా చంద్రశేఖర్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేస్తున్న తహసీల్దార్ రాజేశ్వరి బదిలీపై కలెక్టరేట్ ఏవో విభాగానికి బదిలీ కాగా, మంత్రాలయం తహసీల్దార్‌గా పనిచేస్తున్న చంద్రశేఖర్ బదిలీపై క్రిష్ణగిరికి వచ్చాడు.

పట్టుబడిన మద్యం దొంగలు

మంత్రాలయం, ఆగస్టు 5: మంత్రాలయం మండలంలోని మాధవరం సమీపంలో నందవరం మండలం ఇబ్రహీంపురం గ్రామానికి చెందిన మాల నరేష్, బోయ జయన్న అనే వ్యక్తులు అక్రమ కర్ణాటక మద్యంతో పట్టుబడ్డారు. మాధవరం ఎస్ఐ కృష్ణమూర్తి, కర్ణాటకలోని ఇడపనూరు ఎస్ఐ అవినాశ్ కాంబ్లే తెలిపిన వివరాల మేరకు ఆదివారం అర్ధరాత్రి మాల నరేష్, బోయజయన్న అనే వ్యక్తులు తుంగభద్ర నది సమీపంలో కర్ణాటకలోని తుంగభద్ర రోడ్డు పక్కన నర్సారెడ్డికి చెందిన మద్యం దుకాణం షటర్ పగులకొట్టి దుకాణంలో ఉన్న రూ.3,250 నగదు, మూడు బాక్సుల్లోని 90 ఎంఎల్ 150, క్వాటర్ బాటిల్ 180 ఎంఎల్ టెట్రా ప్యాకెట్లను దొంగలించారు. వారు బ్రిడ్జిపైన మాధవరం వస్తుండగా.. ఎస్ఐ కృష్ణమూర్తి, ఏఎస్ఐ బందెనవాజ్, వారి సిబ్బంది అదుపులోకి తీసుకుని విచారించారు. మద్యంతో సహా ఇద్దరిని అదుపులోకి తీసుకుని కర్ణాటక పోలీసులకు అప్పగించారు.

ఎల్లెల్సీ ద్వారా సాగునీరు అందించాలి

పెద్దకడబూరు ఆగస్టు 5: ఎల్లెల్సీ ద్వారా అన్ని కాలువలకు సాగునీరు అందించాలని సీపీఎం నాయకులు తిక్కన్న, పరమేష్ డిమాండ్ చేశారు.ఈ మేరకు తహసీల్దార్ కార్యలయంలో డీటీ మహేష్‌కు నాయకులు వినతి పత్రం అందజేశారు. నాయకులు బాబు, శివన్న, గోవిందప్ప పాల్గొన్నారు.

'ప్రభుత్వ భూములు అమ్మేస్తున్నారు'

హొళగుంద, ఆగస్టు 5: హొళగుందలోని వెంకటేశ్వర సినిమా థియేటర్ వెనక వైపు ఉన్న కోట్ల రూపాయలు విలువ చేసే ప్రభుత్వ భూమిని కొందరు ప్లాట్లుగా వేసి లక్షల రూపాయలకు అమ్మకాలు చేస్తున్నారని టీడీపీ నాయకులు ఎర్రిస్వామి, గాలి వీరభద్ర గౌడ్, వీరన్న గౌడ్, డీలర్ అంజి, జాకీర్ ఆరోపించారు. సోమవారం వారు మాట్లాడుతూ సర్వే నెంబర్ 557/3లో తోక వెంకటేష్, తోక లక్ష్మి అనే వ్యక్తులకు కొన్ని సంవత్సరాల క్రితం అసైన్మెంట్ కమిటీ చైర్మన్‌గా ఎమ్మెల్యే ద్వారా వ్యవసాయం చేసేందుకు 3 ఎకరాల ప్రభుత్వ భూమిని పొందినట్లు తెలిపారు. దానిని వారు ప్లాట్లుగా మార్చి లక్షల రూపాయలకు అమ్మకాలు చేస్తున్నారని, వాటికి డీ-పట్టాలు తయారు చేసి కొందరికి ఇవ్వడంపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కోట్ల రూపాయలు విలువ చేసే భూమిని రెవెన్యూ అధికారులు స్వాధీనం చేసుకొని డీ-పట్టాలు రద్దు చేసి, నిరుపేదలకు ఎన్టీఆర్ కాలనీ పేరుతో ఇంటి స్థలాలు మంజూరు చేయాలని కోరారు. అనంతరం తహసీల్దార్ ఎఎం ప్రసాద్ రాజుకు వినతిపత్రం అందించారు.


వినతిపత్రం అందిస్తున్న నాయకులు

హంద్రీనీవా నుంచి 106 చెరువులకు నీరు నింపాలి

ఎమ్మిగనూరు రూరల్, ఆగస్టు 5: రాష్ట్ర ప్రభుత్వం కర్నూలు జిల్లాలోని వెనుకబడిన పశ్చిమ ప్రాంతంలో హంద్రీనీవా కాలువ నుంచి 106 చెరువులకు నీరు నింపాలని ఏఐకేఎంఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి సత్యన్న డిమాండ్ చేశారు. సోమవారం తహసీల్దార్ శేషఫణిని కలిసి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో నాగేంద్ర, వీరబాబు, చంద్రన్న, ఏఐటీయూసీ నాయకులు బాలరాజు పాల్గొన్నారు.

డ్రైనేజీని ఏర్పాటు చేయాలి

ఎమ్మిగనూరు రూరల్, ఆగస్టు 5: పట్టణంలోని గోనెగండ్ల రోడ్డు సున్నంబట్టి సమీపంలో ఉన్న మహిళల పబ్లిక్ మరుగుదొడ్డి నుంచి మలం వెళ్లే పైపులైన్ లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని సీపీఐ పట్టణ కార్యదర్శి రంగన్న పేర్కొన్నారు. సోమవారం మరుగుదొడ్డి డ్రైనేజీ పైపులైన్‌ను కాలనీవాసులతో కలిసి పరిశీలించారు. కార్యక్రమంలో 16వ వార్డు శాఖా కార్యదర్శి రాము, సీపీఐ నాయకులు రామాంజనేయులు, తమన్నా, వీరేష్, తిమ్మయ్య, అజారుద్దీన్, రామాంజనేయులు, బాబు లు పాల్గొన్నారు.


మహిళల పబ్లిక్ మరుగుదొడ్డి మలం డ్రైనేజీ దుస్థితిని చూపుతున్న నాయకులు

కక్షపూరిత వ్యాపారం మానుకోవాలి

ఆస్పరి, ఆగస్టు 5: రైతులు పండించిన కూరగాయలకు ధరల కేటాయించడంతో కక్షపూరిత వ్యాపారం మానుకోవాలని మాజీ ఎంపీపీ వెంకటేష్ హితవు పలికారు. సోమవారం ఆయన మాట్లాడుతూ బిలేకల్ కూరగాయల మార్కెట్‌లో వివాదాలు, ఘర్షణలు చోటు చేసుకోవడానికి కారణం మార్కెట్ నిర్వహిస్తున్న వైసీపీ నాయకులేనని ఆరోపించారు. ఆ గ్రామం, సమీప గ్రామాల రైతులకు అందుబాటులో ఉన్న కూరగాయల మార్కెట్‌లో ధరలు కేటాయింపులో వ్యత్యాసం చూపడం తగదని హెచ్చరించారు. మార్కెట్ కాంట్రాక్టు డబ్బులు రూ. మూడు లక్షలు పైగా గ్రామానికి ఇంకా చెల్లించలేదని ఆరోపించారు. ఆగస్టు 15 వరకు నిర్వహణ బాధ్యతలో కొనసాగతామని ధీమాతో మార్కెట్‌ను చిన్నాభిన్నం చేసేందుకు నిర్వాహకులు, వ్యాపారులు కుమ్మక్కయ్యారని విమర్శించారు.

బాధ్యతలు చేపట్టేందుకు తహసీల్దార్ అనాసక్తి?

ఆలూరు, ఆగస్ట్ 5: ఆలూరు మండల తహసీల్దార్‌గా గోవింద్ సింగ్‌ను నియమిస్తూ జిల్లా కలెక్టర్ జూలై 31నా ఉత్తర్వులు జారీ చేశారు. అయితే సోమవారం వరకు బాధ్యతలు చేపట్టలేదు. ఆలూరుకు వచ్చేందుకు తహసీల్దార్ ఆసక్తి చూపుతున్నట్లు తెలుస్తోంది. దీంతో డిప్యూటీ తహసీల్దార్ రజినీ కాంత్ రెడ్డి ఇన్‌చార్జి తహసీల్దార్‌గా కొనసాగుతున్నారు.

రిక్రియేషన్ క్లబ్ సమావేశంలో వాగ్వాదం


నూతన కమిటీ ఎన్నిక ● ప్రెసిడెంట్‌గా పురుషోత్తంగౌడు

ఎమ్మిగనూరు, ఆగస్టు 5: ఎమ్మిగనూరు పట్టణంలోని రిక్రియేషన్ క్లబ్ సర్వసభ్య సమావేశం కార్యదర్శి కేఆర్ రాఘవ రెడ్డి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశంలో సభ్యుల మధ్య వాగ్వాదం చోటు చేసుకోవడంతో ఉద్రిక్తత నెలకొన్నది. దీంతో పోలీసులు రంగప్రవేశం చేయాల్సి వచ్చింది. రిక్రియేషన్ క్లబ్ జనరల్‌బాడీ సమావేశం ప్రారంభంలో గత కమిటీకి సంబంధించిన లావాదేవీల గురించి సభకు వివరిస్తుండగా లెక్కల్లో భారీగా అవినీతి జరిగిందని, అవి పూర్తిగా తేలిన తర్వాతే కొత్త కమిటీని ఏర్పాటు చేయాలని కొందరు అనడంతో వివాదం మొదలైంది. సభ్యుల మధ్య తీవ్ర వాగ్వాదం చోటు చేసుకొని తోపులాటకు దారితీసింది. రూరల్ సీఐ, ఎస్ఐలు క్లబ్‌కు చేరుకొని సర్దుబాటు చేశారు. లెక్కల వివరాల పుస్తకాన్ని తీసుకొని స్టేషన్‌కు రావాలని చెప్పారు. హరినారాయణరెడ్డి, రుద్రగౌడు వర్గీయుల మధ్య భిన్నాభిప్రాయాలు విని పోలీసులు వివాదాలకు అవకాశం ఇవ్వద్దని సూచించారు. అనంతరం క్లబ్ దగ్గరకు చేరుకొని సభ్యులు కొత్త కమిటీని ప్రకటించారు. క్లబ్ ప్రెసిడెంట్‌గా వై.పురుషోత్తంగౌడు, కార్యదర్శిగా సోగనూరు భీమిరెడ్డి ఎన్నికయ్యారు.


కొత్తగా ఎన్నికైన రిక్రియేషన్ క్లబ్ కార్యవర్గం

ఎమ్మిగనూరు రూరల్ సీఐగా విక్రమ్ సింహ

ఎమ్మిగనూరు రూరల్, ఆగస్టు 5: ఎమ్మిగనూరు మండల రూరల్ సీఐగా విక్రమ్‌సింహ సోమవారం బాధ్యతలు చేపట్టారు. సాధారణ బదిలీల్లో భాగంగా విక్రమ్ సింహ బద్వేల్ నుండి ఎమ్మిగనూరు రూరల్‌కు వచ్చారు. ఇక్కడ పనిచేస్తున్న సీఐ మోహన్‌రెడ్డి వీఆర్‌కు వెళ్లారు. సీఐ విక్రమ్ సింహ మాట్లాడుతూ ఎమ్మిగనూరు మండలం, నందవరం మండలంలోని ప్రజలకు సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలన్నారు.



పత్తికొండ అర్బన్ సీఐగా జయన్న



పత్తికొండ టౌన్, ఆగస్టు 5: పత్తికొండ అర్బన్ నూతన సీఐగా జయన్న బాధ్యతలు సోమవారం స్వీకరించారు. కర్నూలు ఫ్యాక్షన్ జోన్‌లో విధులు నిర్వహిస్తున్న జయన్నను పత్తికొండ సీఐగా నియమించారు. ఇక్కడ పని చేస్తున్న సీఐ మురళి మోహన్ వేరే ప్రాంతానికి బదిలీ అయ్యారు. బాధ్యతలు స్వీకరించిన జయన్నకు స్టేషన్ సిబ్బంది, రాజకీయ నాయకులు, పాత్రికేయులు మర్యాదపూర్వకంగా కలిసి కృతజ్ఞతలు తెలిపారు.

తాగు నీరు ఇవ్వకపోతే ఎలా?

● పంచాయతీ అధికారులపై
పత్తిపాడు ఎమ్మెల్యే రామాంజనేయులు ఆగ్రహం

ఆలూరు, ఆగస్టు 5: 'తాగునీటి సమస్యను పరిష్కరించపోతే పంచాయతీ ఎందుకున్నట్లు 18 రోజులకు ఒక్కసారి తాగు నీరు సరఫరా కాకపోతే ఎలా..' అంటూ గుంటూరు జిల్లా పత్తిపాడు ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు ఆలూరు గ్రామ పంచాయతీ అధికారులు, సిబ్బందిపై అగ్రహం వ్యక్తం చేశారు. సోమవారం ఆలూరులో ఆయన ప్రజల నుంచి విన్నపాలు, ఫిర్యాదులను స్వీకరించారు. తాగు నీటి సరఫరాలో పంచాయతీ నిర్వహణ లోపం ఉందని అందుకే ఇలా సమస్య ఏర్పడిందన్నారు. ఇకనుంచి 5 రోజులకు ఒక్కసారి తాగునీరు అందించాలని ఆదేశించారు. జింకల నుంచి పంటలు నష్టపోతున్నాయని, జింకల నివారణకు చర్యలు తీసుకోవాలని సీపీఐ, లిబరేషన్ పార్టీ జిల్లా నాయకులు బోయ మునిస్వామి వినతి పత్రం అందించారు. ఆలూరులో నిర్మించిన అంబేడ్కర్ భవనాన్ని ఆక్రమించుకొని సచివాలయం నిర్వహిస్తున్నారని దీంతో దళితులకు సంబంధించిన వివాహాలు, సమావేశాలు నిర్వహించుకునేందుకు ఇబ్బందిగా మారిందని ఎమ్మార్పీఎస్ రాయలసీమ జిల్లాల అధ్యక్షులు చిప్పగిరి లక్ష్మీనారాయణ, టీడీపీ నాయకులు నరసప్ప కోరారు.


వినతులు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే రామాంజనేయులు

ఆదోని టౌన్: పత్తిపాడు నియోజకవర్గ ఎమ్మెల్యే రామాంజనేయులు సోమవారం స్థానిక మహాయోగి లక్ష్మమ్మ దేవాలయంలో అవ్వను దర్శించుకొని పూజలను నిర్వహించారు. ఆలయ ధర్మకర్తలు ఆయనను సాదరంగా ఆహ్వానించారు. అవ్వ బృందావనానికి పూజలను నిర్వహించిన అనంతరం ఆయనను ఆలయ కమిటీ సభ్యుడు రాచోటి సుబ్బయ్య శాలువాతో సత్కరించి, అవ్వ చిత్ర పఠాన్ని, ప్రసాదాన్ని అందించారు.

దేవాలయ భూములను కాపాడండి

ఆదోని రూరల్, ఆగస్టు 5 : ఆదోని మండలం సాంబగల్లులో దేవాలయ భూములు అన్యాక్రాంతమయ్యాయని గ్రామ మాజీ సర్పంచు బాలరాజు, హనుమంతు, చిన్న రాజప్ప ఆవేదన వ్యక్తం చేశారు. సోమవారం వారు మాట్లాడుతూ, సర్వేనెం.114లో ఇనాం భూమి 9.50సెంట్లు, దేవత ఇనాం సర్వే నెం.1లో 4ఎకరాలు, సర్వే నెం.90/4లో 4.30సెంట్ల భూమిని ఇతరులు కబ్జా చేసి స్వాధీనం చేసుకొని పట్టాదారు పాసుపుస్తకాలు తెచ్చుకొని సృష్టించి అమ్ముకోవడానికి సిద్ధమయ్యారన్నారు. దేవాలయ భూములు రక్షించాలని ఆర్డీవో, తహసీల్దార్ కార్యాలయ అధికారులకు వినతిపత్రం సమర్పించారు.


అధికారులకు వినతిపత్రం ఇస్తున్న మాజీ సర్పంచు

'పార్వతిని హత్య చేశారు..'

కోసిగి, ఆగస్టు 5: మంత్రాలయం మండలం రచ్చుమర్రి గ్రామ సమీపంలో ఉన్న ప్రభుత్వ ఏపీ మోడల్ హాస్టల్‌లో పదో తరగతి విద్యార్థి కురువ పార్వతి ఉరి వేసుకున్నట్లు అధికారులు అంటున్నారని, వాస్తవానికి ఇది హత్య అని ఏఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి ఎస్.వీరేష్ అన్నారు. ఈ విద్యార్థి ఆత్మహత్య చేసుకోలేదని, హత్య చేసి ఉరి వేశారని ఆరోపించారు. మృతి చెందిన విద్యార్థినికి అనేక చోట్ల గాయాలున్నాయని, మెడపై ఇనుపరాడ్డుతో కాల్చినట్లు ఉన్నాయన్నారు. హాస్టల్‌లో సీసీ కెమెరాలు పని చేయడం లేదని, అధికారుల నిర్లక్ష్యమే అన్నారు. కార్యక్రమంలో నాయకులు విజయ్, మల్లికార్జున, సురేష్, రాము, బడేసాబ్, మజీద్, అజిత్ తదితరులు ఉన్నారు.

రాజగోపుర నిర్మాణానికి విరాళాల వెల్లువ

కౌతాళం, ఆగస్టు 5: ఉరుకుంద ఈరన్న స్వామి దేవాలయంలో చేపడుతున్న రాజగోపుర నిర్మాణానికి రూ.లక్ష నగదును స్వామి వారి దేవస్థానానికి విరాళంగా అందించినట్లు ఆలయ డిప్యూటీ కమిషనర్, ఈవో గురుప్రసాద్ తెలిపారు. ప్యాలకుర్తి వాస్తవ్యులు యాపచెట్టు ఉగ్ర నరసింహ సాయి కుటుంబ సభ్యులు రూ.1,11,111ల నగదును దేవాలయ కార్యాలయం నందు ఆలయ సీనియర్ అసిస్టెంట్ విజయ్‌కుమార్‌కు అందజేసినట్లు తెలిపారు. అలాగే ఇదే గ్రామానికి చెందిన తిమ్మారెడ్డి కుటుంబ సభ్యులు రాజగోపుర నిర్మాణానికి రూ.50వేలు, స్వామి వారి నిత్యాన్నదాన పథకానికి రూ.25వేలు అందజేశారు.


దాతలకు స్వామివారి ప్రసాదాలను అందిస్తున్న దృశ్యం

ఇన్‌పుట్ సబ్సిడీ అందిస్తాం

మద్దికెర, ఆగస్టు 5: మండలంలోని ఆయా గ్రామాల్లోని 315 మంది రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీ రావాల్సి ఉందని, ప్రతి ఒక్కరికీ అందేలా చూస్తామని వ్యవసాయ శాఖ అధికారి రవి తెలిపారు. సోమవారం మాట్లాడుతూ రైతు జాబితాలో కొన్ని తప్పులు చోటు చేసుకోవడం వల్ల పరిహారం జమకాలేదన్నారు. 315 మంది రైతులకు చెందిన వివరాలు తప్పుగా ఉన్నట్లు జిల్లా కలెక్టర్ వ్యవసాయ శాఖ అధికారికి తెలియజేశామని అన్నారు. త్వరలోనే రైతుల ఖాతాల్లోకి జమ కావడం జరుగుతుందని ఆయన తెలిపారు.

పంట నమోదు తప్పనిసరి

హొళగుంద ఆగస్ట్ 5: పంట నమోదు వివరాలు తప్ప నిసరిగా చేయించుకోవాలని ఏవో ఆనంద్ లోకాదల్ సోమవారం అన్నారు. హొళగుందలోని శ్రీరామ్ నగర్ క్యాంప్‌లో శివన్న గౌడ్ అనే రైతుకు చెందిన పొలంలోని పత్తి పంటను ఏఈవో విరుపాక్షితో కలిసి పంట నమోదు ప్రక్రియను పర్యవేక్షించారు. ఆయన మాట్లాడుతూ ప్రతి రైతు ఈ పంట నమోదు తప్పనిసరిగా చేయించుకోవాలన్నారు. కార్యక్రమంలో వీఏఏ మణి శ్రీ పాల్గొన్నారు.

వరద బాధితులను ఆదుకుందాం

పత్తికొండ టౌన్, ఆగస్టు 5: కేరళ రాష్ట్రంలో వయానాడ్ జిల్లాలో జరిగిన ప్రకృతి విపత్తు వరద బాధితులను ఆదుకోవడం అందరి బాధ్యత అని సీపీఐ మండల కార్యదర్శి రాజాసాహెబ్ పేర్కొన్నారు. సీపీఐ ఆధ్వర్యంలో సోమవారం పత్తికొండ పట్టణంలో బాధితుల సహాయార్థం విరాళాలను సేకరించారు. ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ బాధితులను ఆదుకునేందుకు తమ వంతు సహాయ సహకారాలు అందించాలని కోరారు. కార్యక్రమంలో సీపీఐ ప్రజా సంఘాల నాయకులు సుల్తాన్, నెట్టికంటయ్య, వీరన్న, కాశీ, గిడ్డయ్య, రాజప్ప, మద్దిలేటి, మాదన్న, ఓబులేసు పాల్గొన్నారు.


విరాళాలు సేకరిస్తున్న నాయకులు

రణమండల కొండపై భక్తులకు సౌకర్యాలు కల్పించాలి

ఆదోని టౌన్, ఆగస్టు 5: పట్టణ పొలిమేరలోని కొండలపై వెలసిన రణమండల ఆంజనేయస్వామి ఆలయానికి వచ్చే భక్తులకు సౌకర్యాలు కల్పించాలని విశ్వహిందూ పరిషత్ నగర కార్యదర్శి మరియాని చెన్న బసప్ప, జిల్లా కన్వీనర్ రవిశంకర్, భజరంగ్దళ్ నగర కన్వీనర్ సంజీవ్ కుమార్ అన్నారు. సోమవారం వారు మాట్లాడుతూ కోట వీరభద్ర స్వామి దేవాలయం నుంచి కొండపైకి వెళ్లే రహదారిని ఇరువైపులా దట్టంగా పెరిగిన ముళ్ల పొదలను తొలగించాలన్నారు. కొండపై తాగు నీటితోపాటు, స్నానపు గదులను, మరుగుదొడ్లను ఏర్పాటు చేయాలని సూచించారు. బల్లెకల్లు సీతారాముడు, దొడ్డగిరి బాలముని, బాలు యాదవ్, బాబు, నవీన్, మహేష్ పాల్గొన్నారు.


మాట్లాడుతున్న వీహెచ్‌పీ నాయకులు

హొళగుందకు విద్యార్థి బస్సు ఏర్పాటు చేయాలి

ఆదోని, ఆగస్టు 5: హొళగుంద, హెబ్బటం, ఇంగాలందల్, నాగనాదనహళ్లి, గ్రామాలకు విద్యార్థులకు బస్సులు లేక ఇబ్బందులు పడుతున్నారని బీడీఎస్ఎఫ్ కన్వీనర్ పగడాల రమేష్ అన్నారు. సోమవారం సబ్ కలెక్టర్ కార్యాలయంలోని డీటీ దీపకు వినతిపత్రం అందజేశారు. నాయకులు బీరప్ప, కొండయ్య, తారకరామ్, విజయకుమార్, హుస్సేన్, శశింద్ర, పాల్గొన్నారు.

అధికారులు లేని ప్రజా సమస్యల పరిష్కార వేదిక

● నలుగురు మాత్రమే హాజరయ్యారు

మద్దికెర, ఆగస్టు 5: తహసీల్దార్ కార్యాలయంలో ప్రతి సోమవారం మీకోసం ప్రజా సమస్యల పరిష్కార వేదికకు అధికారులు నిర్లక్ష్యం చూపుతున్నారు. సోమవారం ఆంధ్రజ్యోతి విజిట్ చేయగా.. తహసీల్దార్ కార్యాలయంలో ఉదయం 10 గంటలకు ప్రారంభమైన ప్రజా సమస్యల పరిస్కార వేదికకు వ్యవసాయ శాఖ అధికారి ఉప్పర రవి, ఈవోఆర్డీ మద్దిలేటి స్వామి, హౌసింగ్ ఏఈ ఉమాకాంత్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ మయాంక్‌లు మాత్రమే హాజరయ్యారు. 10 గంటలకు ప్రారంభమైన ప్రజా సమస్యల పరిష్కార వేదిక మధ్యాహ్నం 1 గంటయినప్పటికీ ఇతర ఏ శాఖ అధికారులు కూడా రాలేదు. మండలంలోని ఎం.అగ్రహారం, పెరవలి గ్రామాలకు చెందిన రైతులు సమస్యలు వినిపించుకుందామని వచ్చారు. ప్రతి సోమవారం తహసీల్దార్ కార్యాలయంలో నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కార వేదికకు అధికారులు రాకపోతే ఎలా అని పలువురు ప్రశ్నిస్తున్నారు. తహసీల్దార్, ఎంపీడీవో, ఏపీవో, ఎంఈ వో, ఐసీడీఎస్, పంచాయితీరాజ్, వైద్యం, విద్యుత్ వివిధ శాఖల అధికారులు హాజరు కాలేదు. జిల్లా అధికారుల నిబంధనల మేరకు ప్రజా సమస్యల పరిష్కార వేదికకు వచ్చే వారు సంతకాలు చేయాల్సి ఉండగా.. గైర్హాజరైన అధికారులు ఎప్పుడో మధ్యాహ్నం వచ్చి సంతకాలు చేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి.


అధికారులు లేని ప్రజా సమస్యల పరిష్కార వేదిక